జీపుజాతాను ప్రారంభిస్తున్న నాయకులు

సెక్యూరిటీ సిబ్బందిపై కక్ష సాధింపు

- ఏడు రోజుల పాటు సస్పెండ్ చేసిన వైనం - సెక్యూరిటీ సిబ్బందిని విధుల్లోకి తీసుకోవాలి : సిఐటియు

ప్రజాశక్తి-కర్నూలు అగ్రికల్చర్

పెరుగుతున్న ధరలకు ఖర్చులకు పెద్ద ఉద్యోగులే బతకలేని దుస్థితిలో ఉన్న ఈ కాలంలో చాలి చాలని వేతనాలతో నెట్టుకొస్తున్న పేద కుటుంబాలు అయిన సెక్యూరిటీ సిబ్బందిపై కక్షసాధింపు చర్యలలో భాగంగా కర్నూలు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఏడు రోజుల పాటు సస్పెండ్ చేసింది.

సస్పెండ్ అయిన సెక్యూరిటీ సిబ్బందిలో ఒకరు మార్కెట్‌లో ఉండే కీలక అధికారికి కొరకరాని కొయ్యగా మారాడు. ఎప్పుడెప్పుడు అతనిపై తమ ప్రతాపం చూపించాలని, ఎప్పుడు తన చేతికి చిక్కుతాడని వేచి ఉన్న ఆ అధికారి కావాలని ఉద్దేశ్య పూర్వకంగా అతనికి డ్యూటీ లేకున్నా సస్పెండ్ చేసేలా చర్యలు తీసుకున్నాడని కొందరు సెక్యూరిటీ సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయ మార్కెట్ ప్రధాన ద్వారం నుండి రెండవ ద్వారం దగ్గర ఉన్న టెంకాయల దుకాణానికి అనునిత్యం టెంకాయలతో లారీ వస్తుంది. ఆ లారీ కొన్ని ఏళ్లుగా ఇదే ద్వారం ద్వారా వస్తుంది. మార్కెట్ ద్వారం వెంట వెళ్లకూడదని, ఇంకో ద్వారం ఉందని ఆ దారి కోర్టు వ్యవహారాల్లో ఉండటం వల్ల ఇదే దారిలో నయాన్నో భయాన్నో కొన్ని ఏళ్లతరబడి తిరుగుతున్నాయి. 6 నెలల క్రితం నుండి ఈ లారీలు ఈ మార్కెట్ ద్వారం నుండి వెళ్లకూడదని ఆదేశించామని ఆ ద్వారం నుండి లారీలను పంపినందుకు ఆ ఇద్దరు సెక్యూరిటీ సిబ్బందిని ఏడు రోజుల పాటు సస్పెండ్ చేశామని మార్కెట్ కమిటీ తెలుపుతుంది.

ఆ రోజు ఏమి జరిగిందంటే !

ఈ నెల 21న ఉదయం 6 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల దాకా సస్పెండ్ అయిన సెక్యూరిటీ గార్డులు విధుల్లో ఉన్నారు. ఆ తరువాత 2 నుండి రాత్రి 9 దాకా, మళ్ళీ రాత్రి 9 నుండి ఉదయం 6 దాకా ఇద్దరు సెక్యూరిటీ సిబ్బంది విధుల్లో ఉన్నారు. టెంకాయల లారీ మార్కెట్ ప్రధాన ద్వారం నుండి వచ్చేముందు సదరు సెక్యూరిటీ విధుల్లో ఉండగా రాలేదని, ఆ లారీ రాత్రి సమయంలో ఎప్పుడు వచ్చిందో తెలీదని ఈనెల 22న ఉదయం 11గంటలకు ఆ లారీ టెంకాయలను దింపుతుండగా మార్కెట్ అధికారులు,పాలకమండలి చూసి సదరు సెక్యూరిటీ సిబ్బంది ఎలా పంపించారని ఆగ్రహం వ్యక్తం చేసి 23 నుంచి ఏడు రోజుల పాటు సస్పెండ్ చేసినట్లు సదరు సెక్యూరిటీలకు తెలిపినట్లు సమాచారం. సదరు సెక్యూరిటీ విధుల్లో లేని సమయంలో లారీ వస్తే ఎలా సస్పెండ్ చేశారో అర్థంకాని గందరగోళ పరిస్థితుల్లో ఉన్నారు. చేసేది ఏమి లేక ఇంట్లోనే ఉండిపోయారు.

సస్పెండ్ చేసిన సెక్యూరిటీ సిబ్బందిని విధుల్లోకి తీసుకోవాలి

- రాముడు, మార్కెట్ యార్డ్ సిఐటియు గౌరవాధ్యక్షులు

చిరు ఉద్యోగులను సస్పెండ్ చేయడం హేయమైన చర్య. లారీని పంపించారనే నెపంతో ఏడు రోజులు సస్పెండ్ చేయడం కక్షసాధింపు చర్య తప్ప ఇంకొకటి కాదు. సస్పెండ్ చేసిన సెక్యూరిటీ సిబ్బందిని వెంటనే విధుల్లోకి తీసుకోవాలి. లేని పక్షంలో సిఐటియుగా ఆందోళన చేపట్టి విధుల్లోకి తీసుకునే దాక పోరాడతాం.

మార్కెట్ లో చక్రం తిప్పుతున్న కీలక ఉద్యోగి

మార్కెట్‌లో ఎలాంటి తంతు అయిన ఆ ఉద్యోగి లేకుంటే కాదు. ప్రతి పనిలో ప్రతి దానిలో ఆ ఉద్యోగే క్రియాశీలకం. కొత్తగా వచ్చిన చైర్మన్‌లు, కార్యదర్శులు ఎవ్వరైనా ఆయన కనుసన్నల్లోనే ఉంటారని మార్కెట్ లో అధికారులు, కింది స్థాయి సిబ్బంది చర్చిస్తున్నారు. లైసెన్స్‌లు జారీ చేయడం, రెన్యూవల్స్ చేయడం, డ్యూటీలు వేయడం, కాటాదారులను నియమించడం వారిని మార్పులు చేర్పులు, సెక్యూరిటీ సిబ్బంది డ్యూటీలు వేయడం ఇలా ప్రతి పనిలో ఆయనదేపైచేయి. ఆయన ఎక్కడ సంతకం పెట్టమంటే అక్కడ పెట్టడమే మార్కెట్ కార్యదర్శి పని అని సిబ్బంది చర్చిస్తున్నారు. మార్కెట్ చైర్మన్ వారంలో రెండు లేదా మూడు రోజులు మాత్రమే మార్కెట్‌కు వస్తుండటం కూడా ఈ ఉద్యోగికి వరంలా మారింది. ప్రతి ఒక్కరు ఆయన మాటే వినాలి వినకుంటే వారి డ్యూటీలు ఎక్కడ ఉంటాయో ఎవ్వరికీ తెలీదు. అలాంటి నీచమైన ఆలోచన కలిగిన ఆ ఉద్యోగికి మార్కెట్ పాలకమండలి, అధికారులు అందలం ఎక్కించారని మార్కెట్ లో ఉండే కమిషన్ దారులు, వ్యాపారులు, సిబ్బంది చర్చిస్తున్నారు.

మందలింపు చర్య ఉండాలని సస్పెండ్ చేశాం

- ప్రభాకర్ రెడ్డి, మార్కెట్ యార్డ్ చైర్మన్

టెంకాయల లారీ మార్కెట్ ద్వారం నుండి వెళ్లకూడదని నిర్ణయించాం. ఆ లారీని పంపినందుకు మందలింపు చర్యగా ఏడు రోజులు సస్పెండ్ చేశాం.

'చలో ఢిల్లీ'ని జయప్రదం చేయండి

- సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రాధాకృష్ణ, అంజిబాబు

- జీపు జాతా ప్రారంభం

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

ఏప్రిల్ 5న చలో ఢిల్లీ కార్యక్రమం జయప్రదం కోసం కర్నూలు జిల్లాలో రెండు రోజుల ప్రచార జీపు జాతను బళ్లారి చౌరస్తా నుంచి శనివారం ప్రారంభించారు. ఈ ప్రారంభ కార్యక్రమానికి మోటార్ వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకులు ఎస్‌కె. రియాజ్ అధ్యక్షత వహించారు. సిఐటియు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పిఎస్.రాధాకృష్ణ, ఎండి.అంజిబాబులు హాజరై జీపు జాతను జండా ఊపి ప్రారంభించారు. అనంతరం డ్రైవర్ ఉద్దేశించి మాట్లాడుతూ లక్షలాదిగా ఉన్న రవాణా రంగ కార్మికులైన ఆటో, లారీ, లైట్ మోటార్ వెహికల్, ప్రజా, సరుకుల రవాణా చేసే డ్రైవర్ల సమస్యలు ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. మోడీ అధికారంలోకి వచ్చాక రవాణా రంగానికి భారంగా మారిన మోటార్ యాక్ట్ సవరణ చట్టం 2019 పార్లమెంటులో ప్రతిపక్షాలు వ్యతిరేకించిన తన అంగబలంతో ఆమోదింప చేసుకొని ఈ బిల్లును తక్షణమే అమలులోకి తీసుకురావాలని, రాష్ట్రాలను ఆదేశించారన్నారు. ఈ బిల్లును కేరళ, తమిళనాడు, కర్ణాటక, తెలంగాణ, ఢిల్లీ, పశ్చిమ బెంగాల్ ప్రభుత్వాలు తాము అమలు చేయబోమని ఖరాఖండిగా చెప్పాయన్నారు. ఎపి ముఖ్యమంత్రి జగన్ మాత్రమే ఆగమేఘాల మీద ఈ బిల్లును స్వాగతిస్తూ జిఒ నెంబర్ 21ని విడుదల చేసింది. ఈ జిఒ వల్ల అధిక జరిమాణాలు, చలానా ఫీజులు లైఫ్ టాక్స్ 100 నుండి 1000 శాతం పెరిగాయన్నారు. రూ. వెయ్యి ఉన్న ఫైన్ రూ.5000 వసూలు చేస్తున్నారన్నారు. గతంలో వాహన పర్మిట్ లేకపోతే రూ.2000 ఉన్నది రూ.10000 వసూలు చేస్తున్నారన్నారు. డ్రైవింగ్ లైసెన్స్ రెన్యువల్, ఫిట్నెస్ లేవనే సాకుతో భారీగా జరిమానాలు పెంచారని అన్నారు. డీజిల్, పెట్రోల్ ధరలను భారీగా పెంచారన్నారు. రవాణా రంగ సమస్యల పరిష్కారానికి ఏప్రిల్ 5న జరుగు చలో ఢిల్లీ కార్యక్రమానికి వేలాదిగా తరలి రావాలని కోరారు. ఆటో వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్, మోటార్ వర్కర్స్ యూనియన్ నాయకులు గంగాధర్, ఆటో వర్కర్స్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు రవి, ఆటో యూనియన్ న్యూ సిటీ ఓల్డ్ సిటీ నాయకులు కుమార్, బడే బయ్, ఎస్.మాలిక్ బాష, రజక వృత్తిదారుల సంఘం జిల్లా కార్యదర్శి గురు శేఖర్, చిన్న వ్యాపారస్తుల సంఘం నగర కార్యదర్శి మహమ్మద్ రఫీ పాల్గొని జాతాకు సంఘీభావం తెలిపారు. ఆటో లారీ డ్రైవర్లు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

గుంటూరు బాపనయ్య జీవితం అందరికీ ఆదర్శం

- వర్ధంతి సభలో సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

గుంటూరు బాపనయ్య జీవితం అందరికీ ఆదర్శమని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పి నిర్మల అన్నారు. కర్నూలు న్యూ సిటీ కమిటీ ఆధ్వర్యంలో సిపిఎం నేత గుంటూరు బాపనయ్య 45వ వర్ధంతి సభ సిపిఎం నగర కార్యదర్శి టి.రాముడు అధ్యక్షతన శనివారం కల్లూరు సూర్యనారాయణ భవన్‌లో నిర్వహించారు. ముందుగా గుంటూరు బాపనయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యురాలు పి నిర్మల మాట్లాడుతూ సిపిఎం నేత గుంటూరు బాపనయ్య జీవితం అందరికీ ఆదర్శమన్నారు. ఆయన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి మూడుసార్లు ఎమ్మెల్యేగానూ ఒకసారి ఎమ్మెల్సీగానూ పనిచేసారన్నారు. ప్రజలు ఆయనకిచ్చిన కట్టబెట్టిన పదవిని వారి సంక్షేమానికి, ప్రజా సేవకు మాత్రమే ఉపయోగించి స్ఫూర్తిగా నిలిచారన్నారు. దివిసీమకు ఆయన సిపిఎం అగ్రనేత మాకినేని బసవ పున్నయ్య స్ఫూర్తితో ఉద్యమంలోకి వచ్చి తుదిశ్వాస వరకూ దానికే అంకితం అయ్యారన్నారు. ఆయన 1952 మద్రాసు లెజిస్లేటివ్ అసెంబ్లీ ఎన్నికలలో దివి నియోజకవర్గం నుండి శాసనసభ్యులుగా, 1962లో నిడుమోలు శాసనసభ నియోజకవర్గం నుండి గెలుపొందారన్నారు. ఓ నిరుపేద దళిత వ్యవసాయ కార్మిక కుటుంబంలో సోమమ్మ, రామస్వామి దంపతులకు 1919 లో జన్మించి ఆరోజుల్లో నాగాయతిప్ప నుంచి అవనిగడ్డ వెళ్లి చదువుకోవాల్సి వచ్చేదన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పిఎస్.రాధాకృష్ణ, నగర కార్యదర్శి వర్గ సభ్యులు సిహెచ్ సాయిబాబా కె. సుధాకర్, రజక వృత్తిదారుల సంఘం జిల్లా కార్యదర్శి సి.గురు శేఖర్, పార్టీ నగర కమిటీ సభ్యులు ఎస్.మొహమ్మద్ రఫీ, యేసు, జమ్మన్న, శేషాద్రి, శ్రీనివాసులు, డివైఎఫ్ఐ నగర కార్యదర్శి హుస్సేన్ బాష పాల్గొన్నారు.

కర్నూలు (కార్పొరేషన్) నగరంలోని వ్యకాస జిల్లా కార్యాలయంలో గుంటూరు బాపనయ్య వర్ధంతి సభ నిర్వహించారు. వ్యకాస జిల్లా ప్రధాన కార్యదర్శి కెవి.నారాయణ మాట్లాడారు. దళితులకు అంటరానితనం వివక్షతకు వ్యతిరేకంగా వ్యవసాయ కార్మిక సంఘం అండగా నిలబడిందని ఆ సంఘానికి ఆ ఉద్యమాలకు ఆకర్షితులై ఉద్యమాల్లో పాల్గొన్నారని తెలిపారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అబ్దుల్లా, కర్నూలు మండల నాయకులు పిబి హుసేనయ్య, జగదీష్ , సంజీవ, సుందర్ రాజు, కల్లూరు మండల నాయకులు శ్రీనివాసులు, గోపి, శీను తదితరులు పాల్గొన్నారు.

నివాళులర్పిస్తున్న నాయకులు

నివాళులర్పిస్తున్న వ్యకాస జిల్లా ప్రధాన కార్యదర్శి కెవి.నారాయణ, తదితరులు

పోరాటాలపై నిర్బంధం..

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

హక్కుల కోసం, న్యాయమైన డిమాండ్ల సాధన కోసం శాంతియుతంగా పోరాటం చేయటం రాజ్యాంగం కల్పించిన హక్కు. అలాంటి హక్కును ప్రభుత్వాలు కాలరాస్తున్నారు. కార్మికుల, ఉద్యోగుల పోరాటాలపై జగన్ మోహన్ రెడ్డి సర్కారు అణచివేత ధోరణితో వ్యవహరిస్తోంది. తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని అంగన్‌వాడీ వర్కర్లు చలో విజయవాడకు పిలుపునివ్వగా రాష్ట్ర ప్రభుత్వం పోలీసుల సాయంతో వారిని ఇళ్ల నుంచి కూడా బయటకు రాకుండా అడ్డుకోవడమే ఆ అణచివేతకు ఒక ఉదాహరణ. చలో విజయవాడకు వెళ్తున్న వారినే కాదు వెళ్తారన్న అనుమానం ఉన్న వారిని కూడా ముందస్తుగా అరెస్టు చేశారు. రైలు ఎక్కిన వారిని రైళ్లలో నుంచి కిందకు దించేశారు. విజయవాడలో జరుగుతున్న ఆందోళనకు బయలుదేరుతున్నారనే అనుమానంతో ఇంటి దగ్గర ఉన్న సిఐటియు కార్యకర్తలను, నాయకులను బలవంతంగా తీసుకుని వచ్చి పోలీస్ స్టేషన్లలో పెట్టారు. ఓర్వకల్లులో సిఐటియు జిల్లా నాయకులు శ్రీధర్, మండల కార్యదర్శి షాజహాన్‌లను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. మంత్రాలయంలో సిఐటియు నాయకులు జయరాజు, అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి వెంకటమ్మను, కోడుమూరులో సిఐటియు నాయకులు గఫూర్‌మియా, ఈరన్న, ఎమ్మిగనూరులో అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు గోవర్ధనమ్మ, కోసిగిలో సిఐటియు నాయకులు రాముడును పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. చిప్పగిరి మండలంలో అంగన్‌వాడీ వర్కర్లను గృహ నిర్బంధంలో ఉంచారు. ఈ నిర్బంధాలపై సిఐటియు నాయకులు జిల్లా వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపట్టారు. అరెస్టులను ఉద్యమాలను ఆపలేరని హితవు పలికారు.

ఆశాల పోరాటం : ఆశా వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని జిల్లా కేంద్రాల్లో ధర్నాలు నిర్వహించారు. కర్నూలులో డిఎంఅండ్‌హెచ్‌ఒ కార్యాలయం ముందు గంటసేపు ధర్నా నిర్వహించారు. సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని డిఎంఅండ్‌హెచ్‌ఒ రామగిడ్డయ్యకు సమర్పించారు. ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి రమీజాబీ, జిల్లా నాయకులు గోపాల్ పాల్గొని మాట్లాడారు.

వీరవనితకు నివాళి : వీరవనిత మల్లు స్వరాజ్యం ప్రథమ వర్ధంతి సందర్భంగా జిల్లా వ్యాప్తంగా మల్లుస్వరాజ్యానికి నివాళులర్పించారు. కర్నూలు ఎపి రైతు సంఘం కార్యాలయంలో వర్ధంతి సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ భూస్వామ్య కుటుంబంలో జన్మించిన మల్లు స్వరాజ్యం పీడిత ప్రజల కోసం చివరి వరకు కొనసాగిన వీరవనిత అని కొనియాడారు. ఆమె ఆదర్శాలను పునికి పుచ్చుకుని నేడు ఉన్న వ్యవస్థను మార్చడానికి నేటి తరం కృషి చేయాలని అన్నారు. జొహరాపురం, షరీన్ నగర్‌లలో ఐద్వా ఆధ్వర్యంలో నిర్వహించిన వర్ధంతి సభల్లో ఐద్వా జిల్లా కార్యదర్శి అలివేలు పాల్గొన్నారు.

అవీ..ఇవీ..అన్నీ..

మోడీ ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా, కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ ఏప్రిల్ 5న చేపట్టనున్న చలో ఢిల్లీని విజయవంతం చేయాలని సిఐటియు నాయకులు సన్నాహక సమావేశాలు నిర్వహిస్తున్నారు. కార్మికులు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని కోరారు. త్రిపురలో కార్మిక వర్గంపై దాడులను నిరసిస్తూ సిఐటియు ఆధ్వర్యంలో ప్రదర్శన, నిరసన చేపట్టారు. జిల్లా వ్యాప్తంగా భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్ వర్ధంతి కార్యక్రమాలు నిర్వహించి వారికి నివాళులర్పించారు. జిల్లాలోని విద్యార్థులకు విద్యా దీవెన మొత్తాన్ని అందించారు. అన్నమయ్య 520వ జయంతి సందర్భంగా పలు కార్యక్రమాలు నిర్వహించారు. ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని వర్క టు రూల్ పేరుతో నిరసన కార్యక్రమాలు చేపట్టారు. జగనన్న గోరుముద్దలో భాగంగా నూతనంగా అందించనున్న రాగిజావ పంపిణీని ప్రారంభించారు.



చెక్కును అందజేస్తున్న కలెక్టర్, జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి

వైఎస్ఆర్ ఆసరా ఆర్థిక సాయం విడుదల

ప్రజాశక్తి- కర్నూలు కలెక్టరేట్

వైఎస్ఆర్ ఆసరా మూడవ విడత ఆర్థిక సాయం నిధులను శనివారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆన్‌లైన్ ద్వారా జమ చేశారు. కర్నూలు జిల్లాలో వైఎస్ఆర్ ఆసరా పథకం ద్వారా మెప్మాకు సంబంధించి 8191 సంఘాలలోని 75,379 మంది సభ్యుల ఖాతాలో రూ.50.44కోట్లు, డిఆర్‌డిఎకు సంబంధించి 17,316 సంఘాల 1,73,228 మంది సభ్యుల ఖాతాలో రూ.90.83 కోట్ల నిధులను నేరుగా పొదుపు మహిళల ఖాతాలో జమ చేశారు. కర్నూలు కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా కలెక్టర్ పి.కోటేశ్వరరావు, జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జె.సుధాకర్, డిఆర్‌డిఎ పిడి వెంకట సుబ్బయ్య, మెప్మా పిడి నాగ శివలీల పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పొదుపు మహిళల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు అభినందనీయమన్నారు. ఈ నిధుల ద్వారా పొదుపు మహిళలు ఆర్థికంగా తమ కుటుంబాలను అభివృద్ధి చేసుకోవాలని వారు పేర్కొన్నారు.

పేద ముస్లింలకు రంజాన్ తోఫా పంపిణీ

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

రంజాన్ పండుగను ముస్లీం సోదరులందరూ ఆనందంగా నిర్వహించుకోవాలని కర్నూలు నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జ్ టిజి భరత్ అన్నారు. నగరంలోని 11, 12 వ వార్డులకు చెందిన ముస్లిం కుటుంబాలకు ఖాన్ బ్రదర్స్ ఆధ్వర్యంలో టిజి భరత్ చేతుల మీదుగా రంజాన్ తోఫా పంపిణీ చేశారు. నెల రోజులకు సరిపడా నిత్యవసర సరుకులను దాదాపు 1500 కుటుంబాలకు పంపిణీ చేశారు. అనంతరం టిజి.భరత్ మాట్లాడుతూ కర్నూలులో ఖాన్ బ్రదర్స్ ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తున్నారన్నారు.

శిథిలావస్థలో వంటగది

ప్రజాశక్తి-సి బెళగల్ :

మండలంలోనీ బురాన్ దొడ్డి ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజననిర్వాహకులు భయంభయంగా వంటా వార్పు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ పాఠశాల వంటగదికి ఆనుకోని ఓవర్ హెడ్ ట్యాంకు శిథిలమై ఉండగా గత ఆరు నెలలక్రితం అధికారులు కూల్చేశారు. ఇక్కడే వంటగదిపై కూలడంతో శిథిలావస్తకు చేరీ ప్రమాదకరంగా మారింది. ఇప్పటికైనా అధికారులు నూతన వంటగది నిర్మాణం చేపట్టాలని వంట నిర్వాహకులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు కోరారు.

నష్టపోయిన రైతులకు పరిహారం ఇవ్వాలి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కావేరి కంపెనీ నకిలీ పత్తి విత్తనాల వల్ల నష్టపోయిన రైతులకు జాప్యం చేయకుండా తక్షణమే నష్టపరిహారం ఇవ్వాలని ఎపి రైతు సంఘం ఆధ్వర్యంలో ఈనెల 28న కలెక్టరేట్ ముందు నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామకృష్ణ కోరారు. శనివారం కార్మిక కర్షక భవన్లో కావేరి విత్తనాలు సాగుచేసి నష్టపోయిన రైతుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 1920-21 న ఖరీఫ్ లో నకిలీ పత్తి విత్తనాల వల్ల కర్నూలు జిల్లాలో విస్తారంగా రైతులు నష్టపోయారని, నష్టపోయిన రైతులను ఆదుకోవాలని, నష్టపరిహారం చెల్లించాలని, కావేరీ కంపెనీని బ్లాక్ లిస్టులో పెట్టాలని అనేక పర్యాయాలు ధర్నాలు రాస్తారోకోలు ఆందోళనలు చేసిన ఫలితంగా ఎకరాకు రూ. 23 వేలు ఇవ్వాలని అవార్డు ప్రకటించింది. అవార్డు ప్రకటించి సంవత్సర కాలం అయినప్పటికీ ప్రభుత్వం మీనమీసాలు లెక్క పెడుతూ రైతులకు ఇంతవరకు నష్టపరిహారం చెల్లించలేదన్నారు. ఎనిమిది వేలఎకరాలలో 1865 మంది రైతులు నష్టపోయినట్టు ప్రభుత్వం గుర్తించిందని, వారందరికీ తక్షణమే నష్టపరిహారం చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతులకు నష్టపరిహారం చెల్లించకుండా హైకోర్టులో స్టే పొంది రైతులను ఇబ్బంది పెట్టాలని చూసినప్పటికీ రైతులందరూ ఈ సంఘటితమై హైకోర్టులో ఉన్న స్టేను తొలగించుకున్నారని తెలిపారు. ఇప్పుకమిషనర్ కార్యాలయంలో కేసు నడుస్తున్నది జాప్యం చేయకుండా నష్టపోయిన రైతులందరికీ నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని సోమవారం మరొకసారి ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయేందుకు పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టాలని కావేరి బాధిత రైతులందరూ సమావేశమై నిర్ణయించారు. ఈ ధర్నా కార్యక్రమంలో బాధిత రైతులందరూ పెద్ద సంఖ్యలో పాల్గొనాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో రైతులు నగేష్, కృష్ణారెడ్డి, వెంకట్రాముడు, పెద్దారెడ్డి, శివారెడ్డి, మాణిక్యాల రెడ్డి, అశోక్ కుమార్, బాటన్న పాల్గొన్నారు.

కావేరి విత్తనాలతో నష్టపోయిన రైతులతో జి.రామకృష్ణ

మైపర్ జాబ్ మేళాకు విశేష స్పందన

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

కర్నూలు నగరంలోని ఏ క్యాంపులో మదర్ తెరిసా పార్మసూటికల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్‌లో మెడిఅసిస్టెంట్ ప్రైవేట్ లిమిటెడ్ బెంగళూరు వారి ఆధ్వర్యంలో జాబ్ మేళా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సుమారుగా బి ఫార్మసీ, ఎం ఫార్మసీ పూర్తిచేసిన వందమంది విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రవి కుమార్ రెడ్డి, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ కె.సురేష్ , అకాడమిక్ డీన్ రాజ్ కుమార్, మెడి అసిస్టెంట్ కంపెనీ అంజన్ కుమార్ హెస్ఆర్ వారు పాల్గొన్నారు. దీని ద్వారా 20 మందిని ప్రాంగణ ఎంపికలో తీసుకున్నారు. వారికి కంపెనీ ఆఫర్ లెటర్ ను అందజేశారు. ఈ ప్రాంగణ ఎంపిక కోసం 23, 24 తేదీలలో క్యాంపస్ రిక్రూట్‌మెంట్ ట్రైనింగ్ ఇచ్చారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఆదిమూలపు సతీష్ , ఎంపికైన విద్యార్థులను అభినందించారు.

విశ్వభారతి మెడికల్ కళాశాలలో ఇసిటి ఆవిష్కరణ

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

విశ్వభారతి మెడికల్ కాలేజీలో శనివారం కర్నూలు సైకియాట్రిక్ సొసైటీ, సైకియాట్రి డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో మానసిక వ్యాధికి ప్రస్తుత చికిత్సగా పిలవబడే 'ఎలక్ట్రోకాన్వల్సివ్ థెరపీ' పై వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ వర్క్‌షాప్‌లో దాదాపు 70 మంది వైద్యులు హాజరయ్యారు.బెంగుళూరులోని(ఎన్ ఐ ఎం హెచ్ ఎ ఎన్ ఎస్) NIMHAN లోని మానసిక వైద్యులు డాక్టర్ జగదీశ్, డాక్టర్ ధ్రువ ఇతల్, డాక్టర్ పవన్ కుమార్ ఇ సి టిపై నిపుణుల ప్రసంగాలు చేశారు. ఈ కార్యక్రమం ద్వారా ఇసిటి గురించిన అపోహలను తొలగించడం గురించి అవగాహన కల్పించారు. తీవ్రమైన మానసిక అనారోగ్యం, ఆత్మహత్యకు గురయ్యే రోగులలో ప్రాణాలను రక్షించే ప్రక్రియగా ఇసిటి ఉంది. ఇసిటిలో ఆచరణాత్మక అంశాలు, పురోగతిపై దృష్టి సారించింది. ఆర్గనైజింగ్ చైర్మన్ డాక్టర్ బి.రమేష్ బాబు, ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ శివశంకర్ రెడ్డి మాట్లాడుతూ, ఇసిటివర్క్‌షాప్ ట్రైనీలు , పంపిణీ చేసిన ఇసిటి పుస్తకాన్ని విశ్వభారతి మెడికల్ కళాశాల చైర్మన్ డాక్టర్ కాంతారెడ్డి విడుదల చేశారు. డాక్టర్ కాంతారెడ్డి , డాక్టర్ మునీరుద్దీన్ (ప్రిన్సిపాల్), డాక్టర్ శ్రీవిద్య ఎంసిఐ పరిశీలకులు డాక్టర్ బి.రమేష్‌బాబు ప్రెసిడెంట్ కర్నూల్ సైకియాట్రిక్ సొసైటీకి వైద్యులను సత్కరించాము.

ఇసిటి పుస్తకాన్ని విడుదల చేస్తున్న డాక్టర్ కాంతారెడ్డి, తదితరులు

గర్భవతులకు రక్తహీన పరీక్షలు : కలెక్టర్

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

గర్భవతులకు రక్తహీన పరీక్షలు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ పి కోటేశ్వరరావు సంబంధిత అధికారులను ఆదేశించారు.శనివారం కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనపై సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష చేశారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు సాధనకు సంబంధించిన 8 అభివృద్ధి అంశాలపై నిర్దేశించిన లక్ష్యాలను సాధించాలని ఆదేశించారు. అందులో భాగంగా 10 నుండి 19 ఏళ్ల బాలికలకు రక్తహీనత పరీక్షలు నిర్వహించాలన్నారు. ఇప్పటికే ఈ అంశంపై 91 శాతం లక్ష్యం సాధించామన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలతో పాటు పాఠశాలలకు వెళ్లని బాలికలకు కూడా రక్తహీనత పరీక్షలు నిర్వహించి, నివారణకు తగిన చర్యలు తీసుకోవడం జరుగుతోందన్నారు. మిగిలిన శాతం కూడా పూర్తి చేయాలని కలెక్టర్ సంబంధిత అధికారి హేమలతను ఆదేశించారు. సమావేశంలో సిపిఓ అప్పలకొండ, ఎస్ఎస్ఎ పిఓ వేణుగోపాల్, డిఎంహెచ్ఓ రామగిడ్డయ్య, ఐసిడిఎస్ పిడి ఉమామహేశ్వరి పాల్గొన్నారు.

రమణమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పిస్తున్న అలివేలు, రాముడు

పేదప్రజల ఆశాజోతి జి.రమణమ్మ

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

పేద ప్రజల ఆశాజ్యోతి జి.రమణమ్మ అని సిపిఎం, ఐద్వా నాయకులు అన్నారు. కర్నూలు మమతానగర్‌లో జి.రమణమ్మ 10వ వర్ధంతి సభ వార్డు కార్యదర్శి పి.దేవన్న అధ్యక్షతన నిర్వహించారు. ఐద్వా జిల్లా కార్యదర్శి ఎన్.అలివేలు, సిపిఎం నగరకార్యదర్శి టి.రాముడు, సీనియర్ నాయకుడు జి.మద్దిలేటి, రేణుకమ్మ, బాలలక్ష్మీ, రోశయ్య, ఉశేన్ బాషా, జి.రమణమ్మ చిత్రపటానికి పూలమాలవేసి నివాళ్ళులు అర్పించారు. వారు మాట్లుడుతూ మమతానగర్, చైతన్యనగర్, నీలంరాజశేఖర్ రెడ్డినగర్, హమీర్ హైదర్‌ఖాన్ నగర్‌లలో పేదప్రజల సొంతింటికల నెరవెర్చడంలో జి.రమణమ్మ, టి.వెంకట్ ఎంతగానో కృషి చేశారని అన్నారు. వార్డు కార్పోరేటర్‌గా అనేక సమస్యలు పరిష్కరించారని అన్నారు. రోడ్లు, డ్రేనేజీ కాలువలు, కరెంటుస్తంభాలు, ఇంటి పట్టాలు, కెసి కెనాల్‌కు అండర్ టన్నెలప్పుడు సిపిఎం ఎమ్మెల్యేగా ఉన్న ఎంఎ.గఫూర్ సహకారంతో పట్టుదలతో సాదించారని అన్నారు. ఈకార్యక్రంలో స్థానిక మహిళ నాయకురాళ్ళు శాంతమ్మ, ఎల్లమ్మ, మాబున్ని, ఎస్.దావీదు, చాంద్ బాషా, శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

వంద శాతం ఉత్తీర్ణతకు కృషి చేయాలి

- డిఇఒ రంగారెడ్డి - కనకవీడు ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులపై ఆగ్రహం

ప్రజాశక్తి - నందవరం

పదో తరగతి విద్యార్థులు ఇష్టపడి చదివితే మంచి ఫలితాలు వస్తాయని, పదో తరగతిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని డిఇఒ వి.రంగారెడ్డి ఆదేశించారు. శనివారం మండలంలోని కనకవీడు ప్రాథమిక పాఠశాల, ఉన్నత పాఠశాల, నందవరం కస్తూరిబా గాంధీ గురుకుల బాలికల పాఠశాల, నందవరం ఉన్నత పాఠశాల, ముగతి మోడల్ స్కూల్, ఉన్నత పాఠశాలలను తనిఖీ చేశారు. ముందుగా ఆయా పాఠశాలల్లోని నాడు-నేడు పనులను, రిజిస్టర్లు, రికార్డులను పరిశీలించారు. ఆయా పాఠశాలల్లోని పదో తరగతి విద్యార్థులతో మాట్లాడుతూ... పబ్లిక్ పరీక్షలంటే భయాందోళనకు గురికాకూడదని తెలిపారు. ప్రశాంత వాతావరణంలో చదువుతూ ఆయా పాఠశాలల్లో విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణతకు సాధించాలని చెప్పారు. అప్పుడే అటు పాఠశాలకు, ఇటు తల్లిదండ్రులకు మంచి గుర్తింపు లభిస్తుందన్నారు. నందవరం, ముగతి ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులు డిఇఒ రంగారెడ్డిని శాలువా, పూలమాలలతో సన్మానించారు. జిల్లా డిఇఒ రంగారెడ్డి వెంట ఉర్దూ పాఠశాలల డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆదాం ఉన్నారు. కనకవీడు ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం అమలు తీరుపై పాఠశాల ప్రధానోపాధ్యాయులు షరీఫ్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. మధ్యాహ్న భోజనం ఏజెన్సీని రద్దు చేసి, కొత్త వంట ఏజెన్సీని ఏర్పాటు చేయాలని తెలిపారు. కొత్త మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అమలు సక్రమంగా జరిగేటట్లు చూడాలన్నారు. నందవరం ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని తనిఖీ చేసి, వాటి అమలు తీరు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఎంఇఒ సుదర్శన్ రెడ్డి, కనకవీడు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు రమేష్, నందవరం కస్తూరిబా పాఠశాల ఇన్‌ఛార్జీ ప్రిన్సిపల్ దివ్యభారతి, నందవరం ఉన్నత పాఠశాల ఇన్‌ఛార్జీ ప్రధానోపాధ్యాయులు లచ్చప్ప, ముగతి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు సంజీవరాజు, ముగతి ఎపి మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ చంద్రశేఖర్, ఉపాధ్యాయులు భోజరాజు, శాంతిమూర్తి, ప్రవీణ్ కుమార్, జయన్న, ఎల్లప్ప, ప్రసాద్, నందవరం ఉన్నత పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ హనీఫ్, క్లస్టర్ రీసోర్స్ పర్సన్ ఉరుకుంద, ప్రభావతి, శ్రీదేవి పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేస్తున్న డిఇఒ

'వాల్మీకుల మధ్య ప్రాంతీయ అసమానతలు సరికాదు'

ప్రజాశక్తి - గోనెగండ్ల

ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం ఎస్టీ చేరిక తీర్మానం పేరుతో రాష్ట్రంలోని వాల్మీకుల మధ్య అసమానతలను రేపడం సరికాదని టిడిపి నాయకులు తెలిపారు. శనివారం గోనెగండ్లలోని టిడిపి కార్యాలయంలో టిడిపి వాల్మీకి సాధికార కమిటీ సభ్యులు రంగస్వామి నాయుడు, టిడిపి వాల్మీకి సీనియర్ నాయకులు ఎన్‌వి.రామాంజనేయులు, వెంకటకృష్ణ నాయుడు, తిరుపతయ్య నాయుడు, రమేష్ నాయుడు, శ్రీధర్ నాయుడు మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చేందుకు చేసిన తీర్మానంలో రాయలసీమలోని వాల్మీకులను మాత్రమే చేర్చుతున్నట్లు ప్రకటించిందని తెలిపారు. రాష్ట్రంలోని వాల్మీకుల మధ్య ప్రాంతీయ అసమానతలను సృష్టించడం తప్ప మరొకటి కాదని చెప్పారు. ఈ నాటకాన్ని రాష్ట్రంలోని వాల్మీకులందరూ గమనించాలని కోరారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే వాల్మీకులందరినీ ఎస్టీ జాబితాలో చేర్చేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు.

'చలో ఢిల్లీ'ని జయప్రదం చేయండి

- సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు రామాంజనేయులు

ప్రజాశక్తి - గోనెగండ్ల

కేంద్రంలోని బిజెపి సర్కారు చేపడుతున్న కార్మిక, కర్షక, ఉద్యోగ, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఏప్రిల్ 5న ఢిల్లీలో చేపట్టే ప్రదర్శనను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బి.రామాంజనేయులు, ఎమ్మిగనూరు తాలూకా నాయకులు బి.రాముడు కోరారు. శనివారం గోనెగండ్ల సొసైటీ ఆవరణలో అన్ని కార్మిక సంఘాలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కార్మికులకు కనీస వేతనాలు, ఉపాధి భద్రత, పిఎఫ్, పింఛను, ఆరోగ్య సౌకర్యాలతో కూడిన సమగ్ర చట్టం కలగానే మిగిలిపోతోందని తెలిపారు. మరోపక్క కార్మికులను యజమానులకు బానిసలుగా చేసే విధంగా కేంద్ర ప్రభుత్వం చట్టాల్లో మార్పులు చేసి ఇబ్బందులకు గురి చేస్తోందని విమర్శించారు. కనీస వేతనం రూ.26 వేలు, సిపిఎస్ రద్దు, ఒపిఎస్ పునరుద్ధరణ, పంటలకు మద్దతు ధర, గ్రామీణ వ్యవసాయ కార్మికులకు కనీస వేతనం రూ.600, 200 పని దినాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఎఐకెఎస్ తాలూకా నాయకులు నరసింహులు, వ్యకాస మండల నాయకులు దేవేంద్ర, విఆర్‌ఎల సంఘం నాయకులు హనుమంతు, దస్తగిరి, బడేసా, అంగన్వాడీ యూనియన్ నాయకులు పుష్పావతి, ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు కృష్ణ, వీరన్న గౌడ్, ఆది, పంచాయతీ కార్మికులు మునెప్ప, నరసింహులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న రామాంజనేయులు

రవాణా రంగ పరిరక్షణకు ఐక్య ఉద్యమాలు

- ఆటో యూనియన్ జిల్లా కార్యదర్శి ప్రభాకర్

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

రవాణా రంగ పరిరక్షణకు కార్మికులంతా పోరాటాలకు ఐక్యంగా కలిసి రావాలని ఆటో యూనియన్ జిల్లా కార్యదర్శి కె.ప్రభాకర్, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎమ్‌డి.అంజిబాబు కోరారు. ఏప్రిల్ 5న చేపట్టే 'చలో ఢిల్లీ' కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సిఐటియు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జీపుజాతా శనివారం పట్టణానికి చేరుకుంది. జాతా సోమప్ప సర్కిల్‌కు చేరుకోగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన మోటారు యాక్ట్ సవరణ బిల్లును దేశంలో అనేక రాష్ట్రాలు వ్యతిరేకించాయని తెలిపారు. రాష్ట్రంలోని జగన్ ప్రభుత్వం మాత్రం ఆగమేఘాల మీద జిఒ 21 పేరుతో రవాణా రంగంపై అధిక పెనాల్టీలు, జరిమానాలు, చలానా ధరలు భారీగా విధిస్తోందని చెప్పారు. రవాణా రంగ ఆటో కార్మికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఈ విధానాలను నిరసిస్తూ ఏప్రిల్ 5న నిర్వహించే చలో ఢిల్లీని జయప్రదం చేయాలని కోరారు. సిఐటియు మండల కార్యదర్శి బి.రాముడు, ఆటో యూనియన్ మండల కార్యదర్శి బి.రాజు, సిఐటియు జిల్లా నాయకులు ఈరన్న పాల్గొన్నారు. **కోసిగి (రూరల్)**కి చేరుకున్న జీపుజాతాకు మండల ఆటో యూనియన్ కార్మికులు స్వాగతం పలికారు. బస్టాండ్, స్టేట్ బ్యాంకు ఆవరణలో ఏర్పాటు చేసిన సభలో ఆటో యూనియన్ జిల్లా కార్యదర్శి ప్రభాకర్ మాట్లాడారు. ఆటో యూనియన్ జిల్లా నాయకులు రాజు, వీరన్న, సిఐటియు మండల కార్యదర్శి రాముడు, రైతు సంఘం నాయకులు వీరేష్, ఆటో యూనియన్ మండల నాయకులు అమీర్, వెంకటేష్, నరసింహులు, చాకలి శ్రీనివాసులు, నాగిరెడ్డి, కొండిగేని నరసింహులు, బలకుంద తాయన్న, కోడి వీరేష్, యు.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. **గోనెగండ్ల**కు చేరుకున్న జీపుజాతాకు సిఐటియు ఎమ్మిగనూరు తాలూకా నాయకులు రాముడు, ఆటో యూనియన్ గోనెగండ్ల మండల నాయకులు కృష్ణ ఆధ్వర్యంలో కార్మికులు స్వాగతం పలికారు. బస్టాండ్ వద్ద ఎపి ఆటో వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి కె.ప్రభాకర్, మోటారు వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఎస్‌కె.రియాజ్, సిఐటియు జిల్లా నాయకులు రామాంజనేయులు మాట్లాడారు. సిఐటియు కోడుమూరు మండల కార్యదర్శి వీరన్న, రైతు సంఘం తాలూకా నాయకులు నరసింహులు, ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు వీరన్న గౌడ్, ఆది పాల్గొన్నారు. **హాలహర్వి** సిఐటియు కార్యాలయంలో సిఐటియు నాయకులు కెపి.నారాయణస్వామి మాట్లాడారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్మికులు, రైతులు, ప్రజల సమస్యలను మరింత జటిలం చేస్తోందని, దీనికి నిరసనగా ఏప్రిల్ 5న చేపట్టే 'చలో ఢిల్లీ'ని జయప్రదం చేయాలని కోరారు. సిఐటియు మండల అధ్యక్షులు కృష్ణ, నాయకులు కొండయ్య, రైతు సంఘం నాయకులు ధనుంజయ్, హమాలీ సంఘం నాయకులు దర్గప్ప పాల్గొన్నారు. **ఆదోని (రూరల్)** మండలంలో ప్రచార జీపు జాతా నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యకాస జిల్లా అధ్యక్షులు కె.లింగన్న, సిఐటియు మండల కార్యదర్శి వీరారెడ్డి మాట్లాడారు. మండలంలోని మదిరే, సంతేకుడ్లూరు, చిన్నహరివాణం, చిన్న గోనెహాళ్, పెద్దహరివాణం, హానువాళ్లు, జి.హోసళ్లి, కడితోట, ఇస్వీ, బసాపురం, నాగనాథనహల్లి, ఛాగి, నారాయణపురం, ఢణాపురంలో జీపుజాతా నిర్వహించారు. సిఐటియు మండల ఉపాధ్యక్షులు బి.తిక్కప్ప, రైతు సంఘం మండల నాయకులు చిన్న తిక్కన్న, డివైఎఫ్ఐ నాయకులు హుస్సేని, వ్యకాస నాయకులు రామప్ప, కెవిపిఎస్ నాయకులు లక్ష్మన్న, మునిస్వామి, పరమేష్ పాల్గొన్నారు.

కోసిగిలో మాట్లాడుతున్న ప్రభాకర్

ఆదోనిలో మాట్లాడుతున్న నాయకులు

మత సామరస్యాన్ని చాటే ఇఫ్తార్ విందు

- మల్లెల గ్రూప్స్ అధినేత డాక్టర్ మల్లెల ఆల్ ఫ్రెడ్ రాజు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

ఇఫ్తార్ విందు మత సామరస్యాన్ని చాటుతుందని మల్లెల గ్రూప్స్ అధినేత డాక్టర్ మల్లెల ఆల్ ఫ్రెడ్ రాజు తెలిపారు. శనివారం పట్టణంలోని సంజీవయ్య నగర్ మక్కా మసీదులో జమాతే ఇస్లాం హిందూ సభ్యుల మధ్య ఎంపిజె రాష్ట్ర నాయకులు లాల్ కోట ఖాదీర్ అన్ని కులాలు, మతాల వారిని కలుపుతూ ఇఫ్తార్ విందు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆల్ ఫ్రెడ్ రాజు మాట్లాడారు. ఎంపిజె రాష్ట్ర నాయకులు లాల్ కోట ఖాదీర్ రాష్ట్రవ్యాప్తంగా ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తూ, సమాజం మేలు కోరే వ్యక్తి అని కొనియాడారు. జై భీమ్ ఎంఆర్‌పిఎస్ జిల్లా అధ్యక్షులు ముత్తు సుమాల, నాయకులు రాజేష్, ఉదయ్, రాజీవ్, అజిత్, సతీష్, జమాతే ఇస్లాం హిందూ సభ్యులు మూసా, ముల్లా ఇస్మాయిల్, అల్తాఫ్, టిడిపి నాయకులు కదిరికోట ఆదెన్న, కౌన్సిలర్ దయాసాగర్, అల్తాఫ్ పాల్గొన్నారు.

ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తున్న నాయకులు

నీటి ఎద్దడి రాకుండా చర్యలు

- వైసిపి సీనియర్ నాయకులు జగన్మోహన్ రెడ్డి

ఎమ్మిగనూరు : వేసవిలో నీటి ఎద్దడి రాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని వైసిపి నియోజకవర్గ సీనియర్ నాయకులు ఎర్రకోట జగన్మోహన్ రెడ్డి తెలిపారు. శనివారం సంబంధిత అధికారులతో కలిసి ఎల్ఎల్‌సి కాలువను, సమ్మర్ స్టోరేజ్ ట్యాంకును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ముందస్తు జాగ్రత్తగా స్టోరేజ్ ట్యాంకులో నీటి నిల్వ చేయాలని సూచించారు. మున్సిపల్ వైస్ ఛైర్మన్ డి.నజీర్ అహ్మద్, కమిషనర్ గంగిరెడ్డి, ఎల్ఎల్‌సి డిఇఇ లక్ష్మణ్ కుమార్, టౌన్ బ్యాంక్ ఛైర్మన్ యుకె.రాజశేఖర్, కౌన్సిలర్ శివకుమార్, వైసిపి నాయకులు గట్టు ఖాజా, జిఎం.బాషా, వడ్డే రంగన్న, యుయు.నాగేష్ ఉన్నారు.

సమ్మర్ స్టోరేజ్ ట్యాంకును పరిశీలిస్తున్న జగన్మోహన్ రెడ్డి

అధికారుల పనితీరు బాగుంటేనే...

ప్రభుత్వానికి మంచి పేరు...

- ఎంపిపి జూటూరు హేమలత మారయ్య, వైసిపి కన్వీనర్ గుమ్మనూరు నారాయణ

ప్రజాశక్తి - చిప్పగిరి

ప్రభుత్వ అధికారులు విధులు సక్రమంగా నిర్వర్తిస్తేనే ప్రభుత్వానికి, ముఖ్యమంత్రికి మంచి పేరు వస్తుందని ఎంపిపి జూటూరు హేమలత మారయ్య, వైసిపి కన్వీనర్ గుమ్మనూరు నారాయణ తెలిపారు. శనివారం మండల కార్యాలయంలో ఎంపిపి హేమలత అధ్యక్షతన ఎంపిడిఒ సుధాకర్ రాజు ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథులుగా వైసిపి కన్వీనర్ గుమ్మనూరు నారాయణ, మండల యువ నాయకులు జూటూరు మారయ్య హాజరయ్యారు. సమావేశం ప్రారంభించగానే ఆయా శాఖల అధికారులు జరిగిన అభివృద్ధి పనులను, జరగబోయే పనులను వివరించారు. డేగలహాల్, గుమ్మనూరు అంగన్వాడీ కేంద్రాల్లో పనితీరు బాగోలేదని సర్పంచులు లక్ష్మీదేవి, నీలకంఠ సమావేశం దృష్టికి తెచ్చారు. విద్యుత్ అవసరాలకు సమయానికి విద్యుత్ స్తంభాలను తమకు అందించడం లేదని విద్యుత్ ఎఇపై చిప్పగిరి సర్పంచి గోవిందరాజులు, నగరడోనా సర్పంచి మల్లమ్మ అసంతృప్తి వ్యక్తం చేశారు. గ్రామాల్లో పొలాలకు వెళ్లే రహదారుల్లో ఎనర్జీస్ నిధుల ద్వారా ముళ్లకంపలు తొలగించి గ్రావెల్ వేయించాలని ఎపిఒ మాధవ శంకర్‌ను ప్రజాప్రతినిధులు కోరారు. ప్రజలకు ఆరోగ్యరీత్యా అన్ని వసతులను ప్రభుత్వాస్పత్రిలో ప్రభుత్వం సమకూరుస్తోందని డాక్టర్ జమీల్ అహ్మద్ తెలిపారు. అనంతరం ఎంపిపి హేమలత మాట్లాడారు. వేసవిలో ఏ గ్రామంలోనూ తాగునీటి కొరత ఏర్పడకుండా చూసుకునే బాధ్యత ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు చూసుకోవాలన్నారు. ప్రతివారం రెండు, మూడు అంగన్వాడీ కేంద్రాలను సూపర్‌వైజర్ పరిశీలించాలని ఆదేశించారు. వైస్ ఎంపిపి నరసింహులు, ఇఒఆర్‌డి సంజన్న, డిప్యూటీ తహశీల్దార్ గుండాల నాయక్, ఎఒ ఆనంద్, ఎంఇఒ మస్తాన్ రావు, పంచాయతీరాజ్ ఎఇ సోలా రెడ్డి, ఎపిఎం నాగార్జున, సూపర్‌వైజర్ ప్రసూన, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ రామనీలా, హౌసింగ్ భవ్య, వెటర్నరీ ఉమాబాయి పాల్గొన్నారు.

సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి హేమలత

గుంటూరు బాపనయ్య ఆశయాలు నెరవేరుద్దాం

- వ్యకాస జిల్లా అధ్యక్షులు వీరశేఖర్

ప్రజాశక్తి - దేవనకొండ

వ్యకాస రాష్ట్ర పూర్వ అధ్యక్షులు గుంటూరు బాపనయ్య ఆశయాలు నెరవేరుద్దామని ఆ సంఘం జిల్లా అధ్యక్షులు వీరశేఖర్ తెలిపారు. శనివారం దేవనకొండ సిఐటియు కార్యాలయంలో గుంటూరు బాపనయ్య వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యకాస ఆధ్వర్యంలో బాపనయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. వ్యకాస మండల ఉపాధ్యక్షులు యూసుఫ్ బాష, ప్రజా సంఘాల నాయకులు మహేంద్ర, రంగన్న, ఎల్లప్ప పాల్గొన్నారు.

ఆసరా కింద 6,566 మంది మహిళలకు లబ్ధి : ఎపిఎం

ప్రజాశక్తి - పెద్దకడబూరు

వైఎస్ఆర్ ఆసరా పథకం కింద మండలంలోని ఆయా గ్రామాల్లో 685 పొదుపు గ్రూపుల్లో 6,566 మంది పొదుపు మహిళలు లబ్ధి పొందినట్లు ఎపిఎం మహేష్ తెలిపారు. శనివారం ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి మూడో విడత ఆసరాను జమ చేసినట్లు చెప్పారు. వైఎస్ఆర్ ఆసరా మూడో విడత కింద మండలంలోని 6,566 మంది పొదుపు మహిళలకు రూ.2,67,38,835లు బ్యాంకు ఖాతాలకు జమ అవుతాయని తెలిపారు. **దేవనకొండ** మండలంలోని 622 పొదుపు సంఘాల్లోని 6,145 మంది మహిళలకు రూ.1.92 కోట్లు మంజూరైనట్లు మండల వైఎస్ఆర్ క్రాంతి పథకం ఎపిఎం రమేష్ తెలిపారు. మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఆసరా మూడో విడత కార్యక్రమాన్ని మహిళలు టివి ద్వారా లైవ్‌లో తిలకించారు.

బహిరంగ వేలం పాటలు...

- మేజర్ పంచాయతీకి భారీగా పెరిగిన ఆదాయం

ప్రజాశక్తి - హోళగుంద

హోళగుంద మేజర్ పంచాయతీ కార్యాలయంలో శనివారం సర్పంచి చలువాది రంగమ్మ అధ్యక్షతన ఎంపిడిఒ దాసు నాయక్ ఆధ్వర్యంలో బహిరంగ వేలం పాటలు నిర్వహించారు. ఈ వేలం పాటల్లో మేజర్ పంచాయతీకి గతేడాదితో పోల్చుకుంటే ఈ ఏడాది ఆదాయం భారీగా పెరిగింది. గతేడాది బస్టాండ్ రూ.2.79 లక్షల ఆదాయం రాగా, ఈ ఏడాది రూ.2.90 లక్షలు వచ్చింది. మార్కెట్ గతేడాది రూ.2.72 లక్షలు రాగా ఏడాది రూ.2.25 లక్షలు వచ్చింది. కమేలా గతేడాది రూ.27 వేలు రాగా ఈఏడాది రూ.38 వేలు వచ్చింది. హోటల్-1 గతేడాది రూ.1.50 లక్షలు రాగా, ఈ ఏడాది రూ.3.38 లక్షలు వచ్చాయి. హోటల్-2 గతేడాది రూ.1.50 లక్షలు రాగా ఏడాది రూ.3.21 లక్షలు వచ్చాయి. హోటల్-3 గతేడాది రూ.1.50 లక్షలు రాగా ఈ ఏడాది రూ.3.01 లక్షల ఆదాయం వచ్చింది. హోటల్-4 గతేడాది రూ.1.50 లక్షలు రాగా, ఈ ఏడాది రూ.3.33 లక్షల ఆదాయం వచ్చింది. హోటల్-5 గతేడాది రూ.67 వేలు రాగా ఈ ఏడాది రూ.2.53 లక్షల ఆదాయం వచ్చింది. గతంతో పోల్చుకుంటే ప్రతిదీ రెండింతలు ఎక్కువగా పెరిగి ఆదాయం పెరిగినట్లు డివిజనల్ పంచాయతీ అధికారిని నూర్జహాన్ తెలిపారు. పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్, ఉప సర్పంచి మీనాక్షి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న అధికారులు

అభివృద్ధికి సహకరించని కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలి

- సర్పంచి అరుణదేవి

ప్రజాశక్తి-ఆలూరు

ఆలూరు అభివృద్ధికి సహకరించని పంచాయతీ కార్యదర్శి కృష్ణకుమార్‌పై చర్యలు తీసుకోవాలని సర్పంచి అరుణదేవి డిమాండ్ చేశారు. శనివారం సిబ్బంది, ప్రజలతో కలిసి పంచాయతీ కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. వీధి లైట్లు, గ్రామాభివృద్ధికి ఖర్చు చేసినా తమ బిల్లులకు సంతకం చేయకుండా, తన ఆదేశాలను బేఖాతరు చేస్తూ, ప్రజలు కొత్త గృహ నిర్మాణాలు చేపడితే వారి దగ్గర అధిక పన్నులు వసూలు చేస్తున్నారని తెలిపారు. ప్రజలు తమతో మొరపెట్టుకోవడంతో కార్యదర్శిని ప్రశ్నించగా 'నీవు ఎవరితోనైనా చెప్పుకో. నేను మంత్రి మనిషి'ని అంటూ సమాధానం ఇస్తున్నారని చెప్పారు. టిడిపి నాయకులు బెంగళూరు కిషోర్, ఐ టిడిపి నాయకులు బెట్టింగ్ రాజ్, ఎంఆర్‌పిఎస్ నాయకులు కత్తి రామాంజనేయులు, ఎల్లప్ప పాల్గొన్నారు.

అంగన్వాడీ ఆయాల పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానం

- సిడిపిఒ ఉమామహేశ్వరి

ప్రజాశక్తి - ఆదోని

ఐసిడిఎస్ ప్రాజెక్టు అర్బన్ పరిధిలోని బోయగేరి-2 (ఈడబ్ల్యుఎస్)లో 21 రోస్టర్ అంగన్వాడీ ఆయాల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు శిశు అభివృద్ధి సేవా పథకం అధికారి ఉమామహేశ్వరి తెలిపారు. శనివారం ఆమె స్థానిక కార్యాలయంలో మాట్లాడారు. అభ్యర్థి తప్పనిసరిగా 10వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలని, 21 ఏళ్లు నిండి 35 ఏళ్ల వయస్సులోపు ఉండాలని చెప్పారు. వివాహితులై ఉండి అదే వార్డుకు సంబంధించిన వారై ఉండాలని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థి 21 ఏళ్లు నిండిన వారు లేకపోతే 18 ఏళ్లు నిండిన వారిని పరిగణనలో తీసుకుంటామన్నారు. పుట్టిన తేదీ, కుల, విద్యార్హత, నివాస స్థలం, వితంతువు అయితే భర్త మరణ, వికలాంగులైతే పిహెచ్, ఆధార్ కార్డు, రేషన్ కార్డు తదితర ధ్రువీకరణ ప్రతాల జిరాక్స్ కాపీలపై సెల్ఫ్ అటెస్టేషన్ చేసి సంబంధిత సిడిపిఒ కార్యాలయంలో ఈనెల 29 సాయంత్రం 5 గంటల్లోపు సమర్పించాలని తెలిపారు. వివరాలకు సిడిపిఒ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

అనుకున్న మాదిరిగానే వేలం

- కొత్త వారికి దొరకని అవకాశం
- సిండికేట్‌గా మారారని విమర్శ

ప్రజాశక్తి - ఆదోని

అనుకున్న మేరకే మున్సిపల్ టెండర్‌లో పాల్గొని మార్కెట్లను కాంట్రాక్టర్లు దక్కించుకున్నారు కొత్త వారికి అవకాశం ఇవ్వకుండా ముందుగానే చేసుకున్న ఒప్పందం మేరకు వేలం జరిగిందని పలువురు విమర్శించారు. మున్సిపాలిటీ పరిధిలోని మార్కెట్ల నిర్వహణ కోసం శనివారం మున్సిపల్ కార్యాలయంలో వేలంపాట నిర్వహించారు. ఝూన్సీ లక్ష్మీబాయి కూరగాయల మార్కెట్, ఎద్దులు, జీవాల వారపు సంత మార్కెట్లకు బహిరంగ వేలం నిర్వహించారు. జెఎల్‌బి మార్కెట్‌ను రూ.71 లక్షలకు జైపాల్, పెద్ద కమేలాను, ఎద్దుల సంతను రూ.17.80 లక్షలకు దుర్గప్ప, చిన్న కమేలా, గొర్రెల సంత రూ.5.90 లక్షలకు ఆదెప్ప దక్కించుకున్నారు. వేలంపాట జరుగుతున్న సందర్భంగానే ఒకరికొకరు సర్ది చెప్పుకుంటూ ఆదాయం పెరగకుండా అడ్డుకున్నారు. వచ్చే ఏడాది మార్చి 31 వరకు సుంకం వసూలు చేసుకునేందుకు అనుమతి ఉందని కమిషనర్ రఘునాథ్ రెడ్డి తెలిపారు. ఏప్రిల్ 1 నుంచి గొర్రెల సంతను బైపాస్ రోడ్డులో గల దుర్గా రైస్ మిల్ వెనుక గల మైదానంలోకి మారుస్తామని చెప్పారు. అక్కడ జీవాలు, పశువులకు తాగునీటి సదుపాయం కల్పిస్తామన్నారు. టెండర్ల వేలంపాట జరుగుతున్న సమయంలో డిపాజిట్ చేసిన వారితో పాటు బయటి వ్యక్తులు కూడా శిబిరంలోకి ప్రవేశించి ఇతర వేలంపాటదారులకు ఆటంకం కలిగించినా మున్సిపల్ అధికారులు ప్రేక్షక పాత్ర వహించడంపై కొందరు వేలంపాటదారులు అసహనం వ్యక్తం చేశారు. ఝూన్సీ లక్ష్మీబాయి కూరగాయల మార్కెట్ పరిధిలో గల హోల్‌సేల్ కూరగాయల మార్కెట్ వ్యవసాయ మార్కెట్ యార్డులో నిర్వహణ ఉండడం వల్ల ఎలాంటి సుంకమూ వసూలు చేయరాదని కమిషనర్ సూచించారు. ట్రాన్స్‌పోర్ట్ వెహికల్స్ మినహా ఇతర లారీల నుంచి సుంకం వసూలుకు అనుమతి ఉందన్నారు. దక్కించుకున్న కాంట్రాక్టర్లు కచ్చితంగా నిబంధనలు పాటించాలని, గెజిట్‌లో పేర్కొన్న ధరలనే వసూలు చేయాలని తెలిపారు. ఫిర్యాదు చేస్తే తప్పనిసరిగా చర్యలు తీసుకుంటామన్నారు. అసిస్టెంట్ కమిషనర్ అనుపమ, రెవెన్యూ ఆఫీసర్ అస్లాం బాష, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు లవ కుమార్, శ్రీనివాసులు, సూరిబాబు, కాంట్రాక్టర్లు రమేష్ యాదవ్, జైపాల్, అల్తాఫ్ హుస్సేన్, రామకృష్ణ, ముక్తార్ అహ్మద్ ఉన్నారు.

సర్ది చెప్పుకుంటున్న కాంట్రాక్టర్లు

వేలం పాట నిర్వహిస్తున్న అధికారులు

ఓట్ల కోసమే జగన్ అసెంబ్లీ తీర్మానాలు

- టిడిపి నాయకులు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

రాబోయే ఎన్నికల్లో ఓట్లు దండుకొని మరోసారి మోసం చేయడానికి వాల్మీకులకు ఎస్టీ గుర్తింపు, దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా వంటి అంశాలను తెరపైకి తెచ్చి అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపడం ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఎన్నికల జిమ్మిక్కులని టిడిపి నాయకులు విమర్శించారు. శనివారం పట్టణంలోని కోట్ల క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు బనవాసి ఆదినారాయణ రెడ్డి, కదిరికోట ఆదెన్న, వక్ఫ్ బోర్డు జిల్లా మాజీ డైరెక్టర్ జి.అల్తాఫ్, రాష్ట్ర ఉప్పర (సగర) ఫెడరేషన్ మాజీ డైరెక్టర్ ఉప్పర ఆంజనేయులు మాట్లాడారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో చావు దెబ్బతినడంతో వాల్మీకులను, దళిత క్రైస్తవులను వశం చేసుకోవాలన్న తాపత్రయంతో వైసిపి హైడ్రామా మొదలు పెట్టిందని విమర్శించారు. టిడిపి హయాంలోనే వాల్మీకుల రిజర్వేషన్ కోసం ప్రొఫెసర్ సత్యపాల్ కమిటీ నివేదికను అసెంబ్లీ తీర్మానం చేసి కేంద్రానికి పంపినట్లు తెలిపారు. ఈ అంశంపై జగన్ సర్కారు నాలుగేళ్లు కాలయాపన చేసి ఎన్నికల ముందు ఓట్ల కోసం హై డ్రామా మొదలుపెట్టిందన్నారు. దళిత క్రైస్తవుల ఎస్సీ హోదా సమస్య కేంద్రం పరిధిలో ఉందని, సుప్రీంకోర్టులో కేసులు నడుస్తున్నప్పటికీ దళిత క్రైస్తవులను మభ్య పెట్టేందుకే అసెంబ్లీ తీర్మానం చేసినట్లు తెలిపారు. ఎన్ని జిమ్మిక్కులకు పాల్పడినా 2024 ఎన్నికల్లో జగన్‌కు ఓటమి తప్పదని, టిడిపి విజయాన్ని ఎవరూ ఆపలేరని చెప్పారు. టిడిపి నాయకులు, ఆత్మ మాజీ ఛైర్మన్ కందనాతి శ్రీనివాసులు, మల్కాపురం పురుషోత్తం రెడ్డి, బనవాసి శ్రీకాంత్ రెడ్డి, టిడిపి సీనియర్ నాయకులు కోడిగంటి శంకరన్న, పట్టణ టిడిపి మైనార్టీ నాయకులు కెఎమ్‌డి.జబ్బార్, ఆఫ్గాన్ వలీ బాష, టిడిపి ఎస్సీ నాయకులు కంపాడు చిన్న రంగన్న పాల్గొన్నారు. అలాగే టిడిపి పట్టణ వాల్మీకి కమ్యూనిటీ నాయకులు కౌన్సిలర్ దయాసాగర్, రామకృష్ణలు విలేకరులతో మాట్లాడారు. పాదయాత్రలో ఇచ్చిన హామీని నాలుగేళ్లు విస్మరించి వాల్మీకులను మోసం చేసిన జగన్ రెడ్డికి లక్షలాది మంది వాల్మీకులు తగిన బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నారు. టిడిపి పట్టణ వాల్మీకి కమ్యూనిటీ నాయకులు బచ్చాలు రంగన్న, ఉరుకుంద, జయన్న, ఆంజనేయులు, రాజు, వీరేష్ పాల్గొన్నారు.

కోట్ల క్యాంపు కార్యాలయంలో మాట్లాడుతున్న టిడిపి నాయకులు

వైసిపికి ఓటమి భయం పట్టుకుంది

- మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ

ప్రజాశక్తి-ఆలూరు

వైసిపి ప్రభుత్వానికి ఓటమి భయం పట్టుకుందని మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ తెలిపారు. శనివారం ఆలూరులోని టిడిపి కార్యాలయంలో దేవనకొండ మండల కన్వీనర్ విజయ్ ఆధ్వర్యంలో కుంకనూర్ గ్రామానికి చెందిన వైసిపి వార్డు సభ్యులు కురువ హరితో పాటు 20 మంది టిడిపిలో చేరారు. వారికి కోట్ల సుజాతమ్మ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. టిడిపికి ప్రజాదరణ పెరుగుతోందని, ఎన్నికలు ఎప్పుడొచ్చిన వైసిపిని సాగనంపేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. జగన్ పాలన నచ్చక ఎమ్మెల్యే కోటాలో స్వంత పార్టీ ఎమ్మెల్యేలు క్రాస్ ఓటింగ్ వేసి టిడిపి ఎమ్మెల్సీని గెలిపించారని చెప్పారు. కురువ బీరప్ప, కురువ శ్రీనివాస్, గోవిందు, శివశంకర్, సోమప్ప, బోయ మధు, తిమ్మప్ప, సుభాన్, చంద్ర ఉన్నారు.

టిడిపిలో చేరిన కుంకనూర్ నాయకులతో మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ

ముఖ్యమంత్రి జగన్‌కు రుణపడి ఉంటాం

- వైసిపి కన్వీనర్ గుమ్మనూరు నారాయణ, ఎంపిపి జూటూరు హేమలత

ప్రజాశక్తి - చిప్పగిరి

వాల్మీకులను ఎస్టీలుగా గుర్తించాలని అసెంబ్లీలో ఆమోదం తెలిపిన ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటామని వైసిపి కన్వీనర్ గుమ్మనూరు నారాయణ, ఎంపిపి జూటూరు హేమలత తెలిపారు. శనివారం చిప్పగిరిలో గుమ్మనూరు నారాయణ, వైసిపి యువ నాయకులు మారయ్య ఆధ్వర్యంలో వాల్మీకులు వాల్మీకి, జగన్మోహన్‌రెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. వాల్మీకులకు ఇంత ప్రాధాన్యత ఇచ్చిన జగన్మోహన్‌రెడ్డి వచ్చే ఎన్నికల్లో 175 సీట్లను గెలవాలని తెలిపారు. వాల్మీకి జిల్లా ఉపాధ్యక్షులు డాక్టర్ వీరాంజనేయులు, వాల్మీకులు డేగులపాడు సర్పంచి నీలకంఠ, నంచర్ల సర్పంచి భీమా, ఎంపిటిసిలు ధర్మేంద్ర, సుంకన్న, అసెంబ్లీ బూత్ కన్వీనర్ రాజన్న, సతీష్, షేకన్న, బాలకృష్ణ, శ్రీధర్, గుంతకల్లు సూరి, రమేష్, పరమేష్ పాల్గొన్నారు. **దేవనకొండ**లో జడ్‌పిటిసి కిట్టు, వైసిపి మండల కన్వీనర్, విఆర్‌పిఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కప్పట్రాళ్ల మల్లికార్జున, వైసిపి యువ నాయకులు కాకర్ల శాంతి కుమార్ మాట్లాడారు. గతంలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా అట్టడుగు వర్గాలైన వాల్మీకులకు అధిక రాజకీయ ప్రాధాన్యత ఇచ్చినట్లు తెలిపారు. **ఆస్పరి** అంబేద్కర్ సర్కిల్ వద్ద ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి, వాల్మీకి మహర్షి చిత్ర పటాలకు పాలాభిషేకం చేశారు. సొసైటీ ఛైర్మన్ గోవర్ధన్, వైసిపి మండల కన్వీనర్ పెద్దయ్య, మండల మాజీ కన్వీనర్ రామాంజనేయులు, సిఇఒ అశోక్, ప్రకాష్, సర్పంచి వెంకటేష్, వైసిపి నాయకులు తిమ్మప్ప, శివ, శ్రీరాములు, రాజు, ఈరన్న, శంకర్, నరసింహులు పాల్గొన్నారు.

అంగన్వాడీ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానం : సిడిపిఒ

ప్రజాశక్తి-ఆలూరు

ఆలూరు ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోని ఖాళీగా ఉన్న అంగన్వాడీ కార్యకర్త, ఆయా పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని సిడిపిఒ లలిత శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. చిప్పగిరి మండలం గుమ్మనూరులో అంగన్వాడీ కార్యకర్తగా బీసీ'డి', ఏరూరు-1లో ఆయాగా ఓసీ, ఆలూరు మండలం అరికేర-3లో ఎస్టీ, ఆస్పరి మండలం ముత్తుకూరు-3 ఈడబ్ల్యుఎస్‌లకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. 10వ తరగతి ఉతీర్ణులై జులై 1, 2022 నాటికి 21 ఏళ్లు పూర్తయి ఉండాలని తెలిపారు. వివాహితులై స్థానికంగా ఉండాలన్నారు. దరఖాస్తు వెంట ధ్రువపత్రాల కాపీలపై అటస్టేషన్ చేయించి ఈనెల 25 సాయంత్రం 5 గంటల్లోపు ఐసిడిఎస్ కార్యాలయంలో ఇవ్వాలని తెలిపారు.

మహారాజ శ్రీ కర్నూలు నాల్గవ అదనపు జూనియర్ సివిల్ (స్పెషల్ ఎక్సైజ్ కోర్టు) జడ్జి గారి కోర్టులో
ఓ.యస్.నెం.215/2019

కె.ప్రసాద్‌రెడ్డి ... వాది

V/s.

జి.నాగిరెడ్డి ... ప్రతివాది

ప్రతివాదికి దావా సమన్లు

జి.నాగిరెడ్డి తండ్రి లేటు జి.ఒబుల్‌రెడ్డి, వ్యాపారం, వయస్సు 58 సంవత్సరాలు, ఇంటి నెం.87-1380-3-408, శ్రీవసంతవిహార్, ధనలక్ష్మినగర్, కర్నూలు.

పై నంబరు దావాలో వాది ప్రతివాది నుండి దావా మొత్తము రూ. 9,54,600/-లు, ఇందుపైన ముందు వడ్డీ మరియు కోర్టు ఖర్చులు రాగోరి దావా దాఖలు చేసినాడు. ఇందులో ప్రతివాది అయిన నీకు ఏమైన అక్షేపణలు వున్న యెడల 29-3-2023 వ తేది ఉదయం 10.30 గం.లకు పై కోర్టులో మీరుకాని మీ తరుపు న్యాయవాదికాని హజరై మీకు గల అభ్యంతరములు తెలుపుకోవలెను. లేనియెడల మీ పరోక్షమున విచారించి తీర్మానింపబడునని ఇందుమూలముగా తెలియజేడమైనది.

కోర్టు వారి ఉత్తర్వుల మేరకు

తేది : 29-3-2023

బైరెడ్డి వెంకటరామిరెడ్డి
వాది పరం న్యాయవాది,
కర్నూలు.
మోబైల్:9440079646

ప్రజాశక్తి
ఆదివారం 26 మార్చి 2023 5
నంద్యాల

మహిళలు ఆర్థిక స్వావలంభన సాధించాలి

- మూడో విడత వైఎస్ఆర్ ఆసరా నిధులు విడుదల
- 25,936 స్వయం సహాయక సంఘాలకు రూ.166.96 కోట్లు
- జిల్లా కలెక్టర్ మనజీర్ జిలాని సామూన్

పొదుపు మహిళలకు మెగా చెక్కు అందజేస్తున్న జిల్లా కలెక్టర్, మార్క్‌ఫెడ్ చైర్మన్, మున్సిపల్ చైర్మన్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

మహిళలు స్వయం ఉపాధి వైపు అడుగులు వేసేలా ప్రభుత్వం కృషి చేస్తోందని, ప్రభుత్వం ఇస్తున్న ఆర్థిక సహాయాన్ని మహిళలందరూ సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సామూన్ కోరారు. వైఎస్సార్ ఆసరా మూడో విడత పథకం కింద జిల్లాలోని డిఆర్డిఎ, మెప్మా పరిధిలోని 25,936 స్వయం సహాయక సంఘాలకు రూ.166.96 కోట్లు జమ అయినట్లు పేర్కొన్నారు. శనివారం ఏలూరు జిల్లా దెందులూరు బహిరంగ సభ నుంచి రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి రాష్ట్ర వ్యాప్తంగా వైయస్సార్ ఆసరా పథకం 3వ విడత రుణమాఫీ కింద రూ.6,419.89 కోట్ల ఆర్థిక సహాయాన్ని 7,98,395 స్వయం సహాయక పొదుపు సంఘాల్లోని 78,94,169 మంది అక్కచెల్లెమ్మల ఖాతాల్లో బటన్ నొక్కి ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని స్థానిక కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో లైవ్ ద్వారా జిల్లా కలెక్టర్ మనజీర్ జిలాని సామూన్, మార్క్‌ఫెడ్ చైర్మన్ పిపి.నాగిరెడ్డి, మున్సిపల్ చైర్మన్ మాబున్నిసా, రాష్ట్ర హస్తకళల డైరెక్టర్ సునీత అమృతరాజ్ తదితరులు వీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నంద్యాల జిల్లాలో ఆళ్లగడ్డ నియోజకవర్గంలో 3044 స్వయం సహాయక పొదుపు సంఘాలకు రూ. 20.89 కోట్లు, బనగానపల్లిలో 4282 సంఘాలకు రూ.28.29 కోట్లు, డోన్‌లో 3029 సంఘాలకు రూ.17.81 కోట్లు, నందికొట్కూర్‌లో 4072 సంఘాలకు రూ.27.29 కోట్లు, నంద్యాలలో 2001 సంఘాలకు రూ.13.95 కోట్లు, పాణ్యంలో 1346 సంఘాలకు రూ.63.94 కోట్లు, శ్రీశైలంలో 3277 సంఘాలకు రూ.21.45 కోట్లు మొత్తం 21,001 సంఘాలకు చెందిన 2,09,692 మంది మహిళా లబ్ధిదారుల ఖాతాల్లో 136.10 కోట్లు నేరుగా జమ చేశామన్నారు. మెప్మా పరిధిలో ఆళ్లగడ్డలో 705 సంఘాలకు రూ.4.93 కోట్లు, ఆత్మకూరులో 331 సంఘాలకు రూ.1.68 కోట్లు, డోన్‌లో 774 సంఘాలకు రూ.4.55 కోట్లు, నందికొట్కూరులో 706 సంఘాలకు రూ.4.39 కోట్లు, నంద్యాలలో 2419 సంఘాలకు రూ. 15.29 కోట్లు మొత్తం 4,935 సంఘాలకు చెందిన 43,059 మంది మహిళా లబ్ధిదారుల ఖాతాల్లో రూ.30.86 కోట్లు నేరుగా జమ చేశామని తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్, మార్క్‌ఫెడ్ చైర్మన్, మున్సిపల్ చైర్మన్, డిఆర్డిఏ పిడి, రాష్ట్ర హస్తకళల డైరెక్టర్ తదితరుల చేతుల మీదుగా స్వయం సహాయక సంఘాల మహిళలకు మెగా చెక్కును అందజేశారు.

పోరాటాలపై అణచివేత...

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

హక్కుల కోసం, న్యాయమైన డిమాండ్ల సాధన కోసం శాంతియుతంగా పోరాటం చేయటం రాజ్యాంగం కల్పించిన హక్కు. అలాంటి హక్కును ప్రభుత్వాలు కాల రాస్తున్నారు. కార్మికుల, ఉద్యోగుల పోరాటాలపై జగన్ మోహన్ రెడ్డి సర్కారు అణచివేత ధోరణితో వ్యవహరిస్తోంది. తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని అంగన్‌వాడీ వర్కర్లు చలో విజయవాడకు పిలుపునివ్వగా రాష్ట్ర ప్రభుత్వం పోలీసుల సాయంతో వారిని ఇళ్ల నుంచి కూడా బయటకు రాకుండా అడ్డుకోవడమే ఆ అణచివేతకు ఒక ఉదాహరణ. చలో విజయవాడకు వెళ్తున్న వారినే కాదు వెళ్తారన్న అనుమానం ఉన్న వారిని కూడా ముందస్తుగా అరెస్టు చేశారు. రైలు ఎక్కిన వారిని రైళ్లలో నుంచి కిందకు దించేశారు. విజయవాడలో జరుగుతున్న ఆందోళనకు బయలుదేరుతున్నారనే అనుమానం తో ఇంటి దగ్గర ఉన్న సిఐటియు కార్యకర్తలను, నాయకులను బలవంతంగా తీసుకుని వచ్చి పోలీస్ స్టేషన్లలో పెట్టారు. నంద్యాల జిల్లా కేంద్రంలో సిఐటియు పట్టణ అధ్యక్షులు లక్ష్మణ్‌ను పోలీసులు అరెస్టు చేశారు. పలు ప్రాంతాల్లో అంగన్‌వాడీ యూనియన్ నాయకులు ఇంటిలో నుంచి బయటకు రాకుండా గృహ నిర్బంధనంలో ఉంచారు. ఈ నిర్బంధాలపై సిఐటియు నాయకులు, అంగన్‌వాడీ వర్కర్లు జిల్లా వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపట్టారు. అరెస్టులను ఉద్యమాలను ఆపలేరని హితవు పలికారు.

ఆశాల పోరాటం : ఆశా వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని జిల్లా కేంద్రాల్లో ధర్నాలు నిర్వహించారు. నంద్యాల సిఐటియు కార్యాలయం నుంచి డిఎంఅండ్‌హెచ్ఒ కార్యాలయం వరకూ ర్యాలీగా వెళ్లి అక్కడ ధర్నా నిర్వహించారు. డిఎంఅండ్‌హెచ్ఒ వెంకట రమణకు వినతిపత్రం సమర్పించారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు ఏసురత్నం, ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రమాకుమారి పాల్గొన్నారు.

వీరవనితకు నివాళి : వీరవనిత మల్లు స్వరాజ్యం ప్రథమ వర్ధంతి సందర్భంగా జిల్లా వ్యాప్తంగా మల్లుస్వరాజ్యానికి నివాళు లర్పించారు. ఆత్మకూరు ధనుంజయ హాల్‌లో నంబూద్రిపాద్, మల్లు స్వరాజ్యం వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. సిపిఎం నంద్యాల జిల్లా కార్యదర్శి టి.రమేష్ కుమార్ పాల్గొన్నారు. డోన్‌లోనూ నివాళులర్పించారు. భూస్వామ్య కుటుంబంలో జన్మించిన మల్లు స్వరాజ్యం పీడిత ప్రజల కోసం చివరి వరకు కొనసాగిన వీరవనిత అని కొనియాడారు. ఆమె ఆదర్శాలను పునికి పుచ్చుకుని నేడు ఉన్న వ్యవస్థను మార్చడానికి నేటి తరం కృషి చేయాలని అన్నారు.

అవీ..ఇవీ..అన్నీ..

మోడీ ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా, కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ ఏప్రిల్ 5న చేపట్టనున్న చలో ఢిల్లీని విజయవంతం చేయాలని సిఐటియు నాయకులు సన్నాహక సమావేశాలు నిర్వహిస్తున్నారు. కార్మికులు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని కోరారు. త్రిపురలో కార్మిక వర్గంపై దాడులను నిరసిస్తూ సిఐటియు ఆధ్వర్యంలో ప్రదర్శన, నిరసన చేపట్టారు. జిల్లా వ్యాప్తంగా భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్ వర్ధంతి కార్యక్రమాలు నిర్వహించి వారికి నివాళు లర్పించారు. జిల్లాలోని విద్యార్థులకు విద్యా దీవెన మొత్తాన్ని అందించారు. అన్నమయ్య 520వ జయంతి సందర్భంగా పలు కార్యక్రమాలు నిర్వహించారు. ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని వర్క టు రూల్ పేరుతో నిరసన కార్యక్రమాలు చేపట్టారు. జగనన్న గోరుముద్దలో భాగంగా నూతనంగా అందించనున్న రాగిజావ పంపిణీని ప్రారంభించారు. శ్రీశైలం దేవస్థానంలో ఉగాది ఉత్సవాలు నిర్వహించారు. కర్ణాటక నుంచి భక్తులు పాదయాత్ర చేసుకుంటూ పెద్ద ఎత్తున తరలి వచ్చారు.

చిన్నారులపై లైంగిక దాడులను అరికట్టండి

- జిల్లా ఎస్‌పి కె.రఘువీర్ రెడ్డి

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

చిన్న పిల్లలపై జరిగే లైంగిక దాడులను అరికట్టాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని జిల్లా ఎస్‌పి కె.రఘువీర్ రెడ్డి తెలిపారు. వరల్డ్ విజన్ ఇండియా నంద్యాల ప్రాంతీయ అభివృద్ధి కార్యక్రమం వారి ఆధ్వర్యంలో శనివారం స్థానిక మధుమణి ఈఎన్‌టి డాక్టర్స్ కాన్ఫరెన్స్ హాల్లో పిల్లల భద్రత కమిటీ సభ్యులకు సామర్థ్యం పెంపొందించేందుకు ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా ఎస్పీ హాజరై మాట్లాడారు. 18 ఏళ్లలోపు వారిని చిన్నపిల్లలుగా గుర్తిస్తారని, ముఖ్యంగా తల్లిదండ్రులు వీరిపై ప్రత్యేక శ్రద్ధ కలిగి ఉండాలని చెప్పారు. ప్రతి చిన్న విషయం కూడా పిల్లలు తల్లిదండ్రులతో పంచుకునే అవకాశాన్ని ఇచ్చినప్పుడే సమాజంలో వారిపై జరుగుతున్న ఈ గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌ల గురించి నిర్భయంగా చెబుతారని అన్నారు. పిల్లల ప్రతి కదలికను తల్లిదండ్రులు ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలని తెలిపారు. ప్రతి గ్రామంలో, పట్టణంలోని వార్డులలో సచివాలయం ఏర్పాటు చేశారని, మహిళా సంరక్షణ కార్యదర్శులు, వార్డు మహిళా సంరక్షణ కార్యదర్శులు, చైల్డ్ వెల్ఫర్ వాళ్లు ఉన్నారని, వీరు గ్రామాలలో ఇలాంటి లైంగిక దాడుల గురించి క్షుణ్ణంగా తెలుసుకొనే అవకాశం ఉందని, సమాచారాన్ని సంబంధిత అదికారులకు అందించేలా పని చేయాలని తెలిపారు. వరల్డ్ విజన్ ప్రాజెక్ట్ ఆఫీసర్ తిరుపతిరావు మాట్లాడుతూ వరల్డ్ విజన్ 2019 నవంబర్ నుండి పలు రకాల ఆరోగ్యం, విద్య, జీవనోపాధి, పిల్లల భద్రత తదితర అంశాలపై ప్రభుత్వ సహకారంతో అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లా బాలల సంరక్షణ అధికారి శారద మాట్లాడుతూ కోవిడ్ వలన ఏ కుటుంబం పిల్లలైనా అనాథలయినా, సింగిల్ పేరెంట్ చిల్డ్రన్ కలిగి ఉనాన వారికి గవర్నమెంట్ ద్వారా సహాయం అందుతుందని తెలియజేశారు. ఆళ్లగడ్డ, కర్నూలులో బాలల సంరక్షణ గృహాలు ఉన్నాయని చెప్పారు. దిశ యాప్ ఎస్సై కల్పనా మాట్లాడుతూ ప్రతి మహిళా దిశ యాప్ డౌన్లోడ్ చేసుకొని భద్రత పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోర్టు అడ్వకేట్ దీప, జిల్లా బాలల పరిరక్షణ అధికారి శారద, ఐసిడిఎస్ సిబ్బంది పద్మజ, నరసింహులు, స్వచ్ఛంద సేవా సంస్థ బర్డ్స్ వెంకటేశ్వర్లు, మదర్ సొసైటీ ప్రెసిడెంట్ రామారావు, ఐసిడిఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

పోస్టర్ విడుదల చేస్తున్న ఎస్‌పి కె.రఘువీర్ రెడ్డి

గుంటూరు బాపనయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు

గుంటూరు బాపనయ్య

ఆశయాలను సాధిద్దాం : సిపిఎం

ప్రజాశక్తి - ఆత్మకూర్

గుంటూరు బాపనయ్య జీవితం నేటి ఉద్యమాలకు స్ఫూర్తి అని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వి. యేసురత్నం, పట్టణ కార్యదర్శి ఏ. రణధీర్‌లు అన్నారు. గుంటూరు బాపనయ్య 45వ వర్ధంతి సందర్భంగా సిపిఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక ఏకలవ్య నగర్‌లో ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గుంటూరు బాపనయ్య సిపిఎం అగ్రనేత మాకినేని బసవ పున్నయ్య స్ఫూర్తితో ఉద్యమంలోకి వచ్చి తుదిశ్వాస వరకూ దానికే అంకితమయ్యారన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ నాయకులు డి రామ్ నాయక్, నాయకులు మహమ్మద్, ఐద్వా నాయకురాలు దాసమ్మ, రేణుక, ఆ కాలనీ ప్రజలు స్వర్ణ, మహేశ్వరీ, సావిత్రి, సునీత, శేషమ్మ, రామయ్య తదితరులు పాల్గొన్నారు. (మిగతా వార్త 6వ పేజీలో...)

జీవనదిలా పాలేరు వాగు

- ఏడాది పొడవునా నీటి ప్రవాహం

ప్రజాశక్తి - సంజామల

సంజామల మండలంలో పాలేరు వాగు సంవత్సరమంతా ప్రవహిస్తూ జీవనదిని తలపిస్తోంది. 10 సంవత్సరాల క్రితం ఈ వాగు వర్షాకాలంలో మాత్రమే ప్రవహించేది. అనంతరం వర్షాకాలం, ఎండాకాలం తేడా లేకుండా నీరు ప్రవహిస్తుండడంతో మండలంలో పాలేరు వాగు వెంట 9 గ్రామాల్లో పంట పొలాలు సస్యశ్యామలంగా విరాజిల్లుతున్నాయి. బొందలదిన్నె, ఓత్రమానుదిన్నె, కమలపురి, ముదిగేడు, ముక్కమల్ల, ఎగ్గోని, ముచ్చలపురి, సి కొత్తపేట, సంజామల గ్రామాల పొలాల్లో పాలేరు వాగు నిత్యం ప్రవహిస్తుంది, వరి, పత్తి, కాయగూరల సాగును రైతులు అధిక విస్తీర్ణంలో సాగు చేస్తున్నారు. కొందరు రైతులు వరి పంటను రెండు పంటలుగా పండిస్తున్నారు. ఇటీవల రెండు సంవత్సరాల నుంచి పాలేరు వాగు వెంట ఉన్న పొలాలను చదును చేసుకుని పైప్ లైన్ ద్వారా వరి సాగు అధికంగా సాగు చేస్తున్నారు. పాలేరు వాగు నిత్యం ప్రవహిస్తుండడంతో మండలంలోని 9 గ్రామాలు రెండు మూడు సంవత్సరాలలో వ్యవసాయంలో మంచి ఫలితాలు సాధిస్తాయని పలువురు రైతులు పేర్కొంటున్నారు. ప్రభుత్వం పాలేరు వాగుకు పంట కాలువలు తీసి రైతులు అభివృద్ధి చెందేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.


సంజామలలో నిత్యం పారుతున్న పాలేరు వాగు

వాగు పక్కనే రెండు కార్లు పండిస్తున్న వరి పంట

రంజాన్ వేళలు

ఆదివారం
ఇఫ్తార్ : 6 : 35

సోమవారం

క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న కాటసాని తిరుపాల్ రెడ్డి

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి

- వైసిపి అవుకు మండల కన్వీనర్ కాటసాని తిరుపాల్ రెడ్డి

ప్రజాశక్తి - బనగానపల్లె

యువత చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని వైసిపి అవుకు మండల కన్వీనర్ కాటసాని తిరుపాల్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని మార్కెట్ యార్డులో ఉగాది పండగను పురస్కరించుకొని కాటసాని ఓబుల్ రెడ్డి యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రాష్ట్ర స్థాయి టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్ పోటీలను కాటసాని తిరుపాల్ రెడ్డి ప్రారంభించారు. క్రీడాకారులతో పరిచయ కార్యక్రమం అనంతరం టాస్ వేసి పోటీలను ప్రారంభించారు. ముందుగా ఆయన బ్యాటింగ్ చేసి క్రీడాకారులను ఉత్తేజ పరిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసానికి, శారీరక దారుఢ్యాన్ని కలిగిస్తాయని తెలిపారు. యువతను క్రీడల్లో ప్రోత్సహించడానికి యువ నాయకుడు కాటసాని ఓబుల్ రెడ్డి ఆధ్వర్యంలో క్రీడా కార్యక్రమాలు చేపడుతున్నట్లు చెప్పారు. క్రీడాకారుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీయడానికి ఇలాంటి పోటీలు దోహద పడతాయని అన్నారు. విజేతలకు మొదటి బహుమతి రూ.30 వేలు, రెండవ బహుమతి రూ.20 వేలు, మూడవ బహుమతి రూ.10 వేలు ఇవ్వనున్నారని, ఈ పోటీల్లో 40 జట్లు పాల్గొననున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు ఈసారి ఎల్లయ్య, అంబటి రవి రెడ్డి, కాటసాని ఓబుల్ రెడ్డి యూత్ సుదర్శన్ రెడ్డి, అత్తార్ అఖిల్ హుస్సేన్, మమ్మదా, ఆర్గనైజర్‌లు మహేంద్ర, జాని, ప్రతాప్, హర్ష తదితరులు పాల్గొన్నారు.

రాగి జావ, చిక్కి పంపిణీ వేళలు మార్పు

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం నందు ఇప్పటివరకు పంపిణీ చేస్తున్న రాగిజావ, చిక్కిలను ఇచ్చే సమయాన్ని ప్రభుత్వ ఆదేశాల మేరకు మార్పు చేసినట్లు జిల్లా విద్యాధికారి అనురాధ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇక నుంచి ఉదయం 8 గంటల 45 నిమిషాలకు ఇస్తున్న రాగిజావను 10 :35 నుండి 10.45కు ఫౌండేషన్ పాఠశాలలకు, ఉన్నత పాఠశాలలకు 10.45 నుండి 10.55 వరకు పంపిణీ చేయాలని ఆదేశించారు. చిక్కి లేని రోజుల్లో మంగళ, గురు, శనివారాల్లోనూ రాగిజావను అందించాలని పేర్కొన్నారు. చిక్కిలను సాయంత్రం పాఠశాల నుంచి బయటకు వచ్చే సమయంలో విద్యార్థులందరికీ అందించాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా పాఠశాలల్లో మార్చిన వేళలను పాటించాలని ఆదేశించారు.

పౌష్టికాహారంపై అవగాహన

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

పట్టణంలోని రెండవ అంగన్వాడీ కేంద్రంలో సిడిపిఓ, సూపర్వైజర్ ఆదేశాల మేరకు కార్యకర్తలు పౌష్టికాహార పక్షోత్సవాల (పోషన్ పక్వాడ్) సందర్భంగా గర్భవతులు, బాలింతలు, ఆరు నెలల నుంచి మూడు సంవత్సరాల పిల్లలకు పౌష్టిక ఆహారంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్వాడీ కార్యకర్తలు జక్కీర బేగం, పెద్దక్క, శాంతమ్మ, మమత, మరియమ్మ, చెన్నమ్మ, లక్ష్మి కుమారి, శైల కుమారిలు మాట్లాడుతూ బాలింతలకు, గర్భవతులకు చిరుధాన్యాలు తినడం వల్ల ఆరోగ్యానికి ఎంతో మేలు అన్నారు.

8, 11వ కేంద్రాల్లో : పట్టణంలో 8, 11 అంగన్వాడి కేంద్రంలో పౌష్టిక ఆహార పక్షోత్సవాలలో భాగంగా ప్రీస్కూల్ చిన్నారుల తల్లులకు అంగన్వాడీ కేంద్రాలకు ఆహ్వానించి అవగాహన కల్పించారు. అంగన్వాడీ కార్యకర్త బద్రున్, ధనలక్ష్మి, దేవమ్మ తదితరులు పాల్గొన్నారు

చిరుధాన్యాలపై అవగాహన : పట్టణంలోని 21వ అంగన్వాడి కేంద్రంలో గర్భిణీలు, బాలింతలకు చిరుధాన్యాల ఉపయోగాలు, బాలమృతంపై అవగాహన కార్యక్రమాన్ని అంగన్వాడీ కార్యకర్త హుస్సేనమ్మ నిర్వహించారు.

రుద్రవరం : మండలంలోని చిన్న కంబలూరు గ్రామం లోని రెండవ అంగన్వాడీ కేంద్రంలో ఈసిసిఈ కార్యక్రమంపై తల్లులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. పోషణ్ పక్వాడ కార్యక్రమంలో భాగంగా ప్రీస్కూల్ పిల్లలకు అంగన్వాడి కేంద్రాలలో ఆటపాటలతో విద్య ఎలా నేర్పుతున్నారు, బలమైన పోషక ఆహారం ఎలా అందజేస్తున్నారు. తదితర అంశాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ చెన్నప్ప, పంచాయతీ కార్యదర్శి కళావతి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అంగన్వాడీ టీచర్ పద్మావతి మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాలలో పిల్లలకు ప్రీస్కూల్ విధానంలో ఆటపాటలతో విద్య, పోషక ఆహారాన్ని క్రమం తప్పకుండా ఇస్తున్నట్లు తెలిపారు. ఆశా కార్యకర్త కృపావతి, తల్లులు పాల్గొన్నారు.

ఆళ్లగడ్డ : అవగాహన కల్పిస్తున్న దృశ్యం

రుద్రవరం : పాల్గొన్న సర్పంచ్ చెన్నప్ప, కార్యదర్శి కళావతి

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ : అతివేగం, నిర్లక్ష్యంగా వాహనాన్ని డ్రైవింగ్ చేయడంతో నిండు ప్రాణం బలి అయిన సంఘటన దొర్నిపాడులో చోటుచేసుకుంది.. వివరాలు.. అర్జునపురం గ్రామానికి చెందిన ఇసుకపల్లి ఎర్ర లింగమయ్య (58) శుక్రవారం రాత్రి సుమారు 11:30 సమయంలో కెసి కట్ట సమీపంలో గల పెట్రోల్ బంకు వద్ద ఆగి ఉన్న ఆటో వద్ద నిలబడి డ్రైవర్‌తో మాట్లాడుతుండగా కోయిలకుంట్ల నుండి ఆళ్లగడ్డ వైపు వెళ్తున్న సిమెంటు కంకర లారీ డ్రైవర్ అతివేగంగా వచ్చి ఆటోను, ఆటో వద్ద ఉన్న వ్యక్తిని ఢీకొట్టింది. దీంతో ఎర్ర లింగమయ్య రోడ్డుపై పడ్డాడు. రోడ్డుపై పడిన ఎర్ర లింగమయ్యపై లారీ వెళ్లడంతో శరీరం నుజ్జు నుజ్జు అయి అక్కడికక్కడే మృతి చెందాడు. ఆటో సమీపంలోని వరి చేలో బోల్తా పడింది. ఆటో డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. సంఘటనా స్థలం నుంచి లారీ డ్రైవర్ పరారయ్యాడు. విషయం తెలుసుకున్న దొర్నిపాడు ఏఎస్ఐ ప్రతాపరెడ్డి సంఘటన స్థలానికి చేరుకొని లారీని స్టేషన్కు తీసుకొచ్చారు.. మృతుడి అన్న కొడుకు ఇసుకపల్లి నాగ లింగమయ్య ఫిర్యాదు మేరకు ఎఎస్ఐ కేసు నమోదు చేశారు.

మాట్లాడుతున్న డాక్టర్ కాంతారావు నాయక్

టీకాలు తప్పనిసరిగా వేయించాలి

ప్రజాశక్తి - గోస్పాడు

పుట్టిన ప్రతి బిడ్డకు 24 గంటలలోపు ప్రసవం జరిగిన ఆసుపత్రులలో బర్త్ డోస్ టీకాలు, బిసిజి, హెపటైటిస్–బి, రెండు పోలియో చుక్కలు తప్పనిసరిగా ఇప్పించాలని రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమం ప్రోగ్రాం అధికారి డాక్టర్ కాంతారావు నాయక్ అన్నారు. శనివారం మండలంలోని కానాలపల్లె వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్‌లో ఆరోగ్య కార్యకర్త చంద్రకళ, మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్ ప్రసన్న నిర్వహిస్తున్న వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ వెంకటరమణ, ఆశా కార్యకర్తలు సుభద్ర, వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పప్పు శనగకు గిట్టుబాటు ధర కల్పించండి

ప్రజాశక్తి - సంజామల

పప్పు శనగ పంటకు గిట్టుబాటు ధర కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సంజామల మండల రైతులు కోరుతున్నారు. శనివారం స్థానిక మీడియాతో రైతులు శ్రీనివాస్ రెడ్డి, గుర్రప్ప, వెంకటేశ్వర్లు, దేశం మాట్లాడారు. శనగ బస్తా ధర 6 వేల రూపాయలు ఉండేదని, కానీ ప్రస్తుతం రూ.4,500 ఉందన్నారు. పైరు వేసేటప్పుడు రూ. 6 వేలు ఉండగా ఎకరా 12 వేల రూపాయలు కౌలుకు తీసుకున్నారని, కానీ ఇప్పుడు రేటు తక్కువ ఉండడంతో కౌలుకు తీసుకున్న రైతులు చాలా నష్టపోతున్నారని చెప్పారు. ఎకరాకు రూ.12 వేలు ఖర్చు రాగా కౌలు రూ. 12 వేలు మొత్తం రూ.24 వేలు ఖర్చు వస్తుందని, ప్రస్తుతం ఎకరాకు ఆరు బస్తాలు పంట దిగుబడి వచ్చిందని, దీంతో ఖర్చు పోతే మిగిలేది ఏమీ లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సొంతపొలం ఉన్న వారికి కొంత మిగులుతున్నా కౌలు రైతులు భారీగా నష్టపోతున్నారని చెప్పారు. శనగ పంటకు గిట్టుబాటు ధర వచ్చేటట్లు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని రైతులు కోరారు.

29లోగా ధ్రువీకరణ పత్రాలు ఇవ్వాలి

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

గత నెల ఫిబ్రవరి 5న జరిగిన నేషనల్ మీన్స్–కం–మెరిట్ స్కాలర్షిప్ పరీక్షకు హాజరైన విద్యార్థుల సర్టిఫికెట్ల తనిఖీ నిమిత్తం విద్యార్థుల లిస్ట్ ఈ కార్యాలయపు వెబ్సైటు నందు ఉంచినట్లు జిల్లా విద్యాశాఖాధికారి అనురాధ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ లిస్ట్‌లో పేరు ఉన్న విద్యార్థులు ఈ నెల 29వ తేదీ లోపు కుల, ఆదాయ, 7వ తరగతి మార్కుల శాతం ధృవీకరించు పత్రం, అంగవైకల్యం ఉన్న విద్యార్థులు వైకల్యం ధృవీకరించు పత్రం, ఆధార్ కార్డ్ నకలు, హాల్ టికెట్ జిరాక్స్ కాపీతో జతపరచి సంబంధిత పాఠశాల వారి ద్వారా జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో ఖచ్చితంగా సమర్పించాలని సూచించారు. ఆలా అందజేయని విద్యార్థుల కులం ఒసిగా పరిగణించబడునని, తుది జాబితా విడుదల చేసిన తరువాత ఎట్టి పరిస్థితులలోనూ ఎటువంటి అభ్యర్థనలు స్వీకరించబడవని స్పష్టం చేశారు.

పది పరీక్షలు రాసే విద్యార్థులకు ఉచిత బస్సు సౌకర్యం

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

పదవ తరగతి పరీక్షలు రాసే విద్యార్థులకు ఎపిఎస్ఆర్‌టిసి పల్లె వెలుగు బస్సుల్లో హాల్ టికెట్ చూపించి ఉచితంగా ప్రయాణం చేయవచ్చని జిల్లా ప్రజా రవాణా అధికారి టి.శ్రీనివాసులు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ఉచిత ప్రయాణం పదవ పరీక్షలు మొదలైన రోజు ఏప్రిల 3 నుండి 18 వరకు కల్పించినట్లు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు.

వందేళ్లు దాటినా కూలీ పనికెళ్తున్న మహిళ

ప్రజాశక్తి-నంద్యాల కలెక్టరేట్

వెంకట సుబ్బమ్మ

యాభై ఏళ్లు దాటితే ఏదో అనారోగ్య సమస్య ఎదురవుతున్న ఈ రోజుల్లో వందేళ్ల తరువాత కూడా ఓ మహిళ కూలీపనులకు వెళ్తూ తనను తాను పోషించుకుని కుమారులకు సహకరిస్తుంది. ఉరుకులు పరుగుల జీవితంలో ఉన్న ఈ రోజుల్లో 50 సంవత్సరాలకే ప్రతి ఒక్కరికి ఏదో ఒక అనారోగ్య సమస్యను ఎదుర్కొంటున్నారు. నంద్యాల పట్టణంలోని 100 సంవత్సరాల వెంకట సుబ్బమ్మ బిపి, షుగర్‌లాంటి సమస్యలేవీ లేవు. సంపాదనకు వృద్ధాప్యం అడ్డురాలేదు. ఆమెకు ఎలాంటి అనారోగ్య సమస్యలు లేవు. తన భర్త 30 సంవత్సరాల క్రితమే చనిపోయారు. అప్పటినుండి ఇప్పటివరకు కూలి పని చేస్తున్నారు. ఆమెకు ఇద్దరు కుమారులు ఉన్నారు. ఇప్పటికీ ప్రతిరోజు పనిచేస్తూ తన ఇద్దరు కుమారులకు చేదోడువాదోడుగా ఉంటున్నారు. ఆమె కృషిని పలువురు అభినందిస్తున్నారు.

వైభవంగా చౌడేశ్వరి దేవి బ్రహ్మోత్సవాలు

ప్రజాశక్తి - బనగానపల్లె

మండలంలోని నందవరం చౌడేశ్వరి దేవి బ్రహ్మోత్సవాలు నాలుగవ రోజు శనివారం వైభవంగా జరిగాయి. అమ్మవారికి నామవాళితో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి చౌడేశ్వరి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవస్థానానికి వచ్చిన ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డికి ఆలయ ఈవో రామానుజన్ ఆధ్వర్యంలో పూజారులు, సిబ్బంది పూర్ణకుంభాభిషేకంతో ఘన స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే, వైసిపి అవుకు మండల కన్వీనర్ కాటసాని తిరుపాల్ రెడ్డిలు అమ్మవారికి కుంకుమార్చనతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో చౌడేశ్వరి దేవస్థానం మాజీ చైర్మన్ పి.ఆర్ వెంకటేశ్వర రెడ్డి, తమ్మడపల్లె సర్పంచ్ వెంకటరామిరెడ్డి, మధు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డికి పూర్ణకుంభాభిషేకంతో స్వాగతం పలుకుతున్న అధికారులు

మాట్లాడుతున్న ఎంఇఒ సోమశేఖర్

పాఠశాలలో విద్యార్థులను చేర్పించాలి : ఎంఇఒ

ప్రజాశక్తి - బేతంచెర్ల

రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నడుస్తున్న ప్రభుత్వ పాఠశాలలో తల్లిదండ్రులు పిల్లలను చేర్పించి ఉపాధ్యాయులు అందించే సేవలను సద్వినియోగం చేసుకోవాలని బేతంచెర్ల మండలం ఎంఇఒ సోమశేఖర్ అన్నారు. బేతంచెర్ల మండల పరిధిలోని గొర్లగుట్ట గ్రామంలో ప్రాథమిక ఉన్నత పాఠశాల వార్షికోత్సవ వేడుకలను పాఠశాల ప్రధానోపాధ్యాయులు శివకుమార్ స్వామి గ్రామ సర్పంచ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఇఒ సోమశేఖర్, ప్రధానోపాధ్యాయులు శివకుమార్ స్వామి మాట్లాడుతూ గ్రామంలోని ప్రజలు తమ పిల్లలను ఉన్నత చదువులు చదివించాలని అందుకు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో చదివించి వారి భవిష్యత్తుకు మంచి తోడ్పాటు ఇవ్వాలని అన్నారు. ప్రధానంగా పిల్లల తల్లిదండ్రుల ప్రధాన పాత్ర అని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలో పిల్లలని చదివించడానికి తప్పకుండా బాధ్యత వహించాలి అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు చలపతి రెడ్డి, రామసుబ్బయ్య, నారాయణరెడ్డి, మద్దిలేటి, శివశంకర్, తదితరులు పాల్గొన్నారు.

కస్తూర్బా పాఠశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తులు

ప్రజాశక్తి - బండి ఆత్మకూరు

స్థానిక కస్తూర్బా బాలికల పాఠశాలలో 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రవేశాలకు దరఖాస్తులు చేసుకోవాలని పాఠశాల ఎస్ఓ అనురాధ తెలిపారు. ఆమె శనివారం విలేకరులతో మాట్లాడుతూ వచ్చే విద్యా సంవత్సరంలో కస్తూర్బా పాఠశాలలో చేరేందుకు 6వ తరగతి, ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యార్థులతో పాటు7,8,9 తరగతుల్లో మిగిలిన సీట్ల భర్తీ కోసం ప్రభుత్వం నోటిఫికేషన్ ఉత్తర్వులు, మార్గదర్శకాలు జారీ చేసినట్లు ఆమె తెలిపారు. ఏప్రిల్ 25 వరకు ఆన్లైన్ దరఖాస్తులు అందుబాటులో ఉంటాయన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని ఆసక్తి ఉన్న విద్యార్థినీలు నిర్ణీత సమయంలో మీ సేవల దగ్గరగానీ, సచివాలయ కేంద్రాల్లో గాని ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

సబ్ స్టేషన్ నిర్మాణం చేయొద్దు

ప్రజాశక్తి - గడివేముల

మండలంలోని కుర్రపోలురుగ్రామ సమీపాన 220 కెవి విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణం కొరకు శనివారం నాడు తహాశీల్దార్ శ్రీనివాసులు తమ బృందంతో పొలాన్ని సర్వే చేస్తుండగా గ్రామ రైతులు అడ్డుకున్నారు. తాము జీవించడానికి జీవనాధారం ఈ పొలాలేనని తహాశీల్దార్‌తో వాగ్వివాదానికి దిగారు. మాకు వేరే చోట జీవనధారానికి పోలాలు చూపించాలాని కోరారు. మా గ్రామంలో ఒక్కొక్కరు 20 నుండి 30 ఎకరాలు పొలాన్ని సాగు చేస్తున్నారని ఆ పొలాల్లో విద్యుత్ కేంద్రం నిర్మించవచ్చు కదా అని రైతులు ప్రశ్నించారు. కేవలం రెండు మూడు ఎకరాలు ఉన్న తమ భూములను అన్యాయంగా తీసుకోవడం సరైనది కాదని రైతులు హెచ్చరించారు.

సిపిఎం ఆధ్వర్యంలో సంతకాల సేకరణ

చిన్న గుమ్మడాపురం రోడ్డు పనులను పూర్తి చేయాలి : సిపిఎం

ప్రజాశక్తి - ఆత్మకూరు

ఆర్ అండ్ బి రోడ్డు బస్ స్టాప్ నుండి చిన్న గుమ్మడాపురం వరకు 0.8 కిలోమీటర్లు రోడ్డు పనులను పూర్తి చేయాలని సిపిఎం మండల నాయకులు ఎన్ స్వాములు, చిన్న గుమ్మడాపురం శాఖ కార్యదర్శి ఎం జ్ఞాన సూర్యుడు డిమాండ్ చేశారు. శనివారం నాడు అర్ధాంతంగా నిలిచిపోయిన రోడ్డు పనులను పూర్తి చేయాలని సిపిఎం ఆధ్వర్యంలో సంతకాల సేకరణ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్ అండ్ బి రోడ్డు బస్ స్టాప్ నుండి చిన్న గుమ్మడాపురం వరకు 0.8 కిలోమీటర్ల రోడ్డు రూ. 66.70 లక్షల నిధులతో 2019 జనవరి 2న ప్రారంభించడం జరిగిం దన్నారు. మెగా ఇంజనీరింగ్ కంపెనీ వాళ్ళు అప్పటికే ఉన్న పాత రోడ్డును జెసిబిలతో తవ్వి కంకర మాత్రమే వేసి దానిపై కనీసం మట్టి కూడా వేయకుండా అలాగే వదిలేయడం వల్ల గ్రామ ప్రజల రాకపోకలకు ఇబ్బందికరంగా మారిందన్నారు. మోటార్ సైకిల్లు ఆటోలు గ్రామంలోకి వచ్చే పరిస్థితి లేదని, ఆత్మకూరు నుండి రైతులు ఎరువులు సరుకులు తెచ్చుకోవాలంటే గ్రామంలోకి వాహనాలు వచ్చే పరిస్థితి లేదన్నారు. నాలుగు సంవత్సరాలైనా రోడ్డు పనులు పూర్తి చేయకపోవడం వల్ల గ్రామ ప్రజలు ఇబ్బందులకు జరుగుతున్న ప్రభుత్వం గానీ ప్రజా ప్రతినిధులు గాని పట్టించుకోకపోవడం లేదని పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం తగు చర్యలు తీసుకొని అసంపూర్తిగా ఉన్న రోడ్డు పనులను పూర్తిచేసి ప్రజలకు రవాణా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంసోను స్వాములు, ప్రభాకర్, అబ్రహం, తదితరులు పాల్గొన్నారు.

సస్పెన్స్ ఉత్తర్వులను ఉపసంహరించుకోవాలి : యుటిఎఫ్

ప్రజాశక్తి -ప్యాపిలి

గత సంవత్సరం కొలిమిగుండ్ల మండలం అంకిరెడ్డి పల్లె గ్రామంలో ఎస్ఎస్‌సి పబ్లిక్ పరీక్షల సమయంలో ఉపాధ్యాయులను సస్పెండ్ చేసిన ఉత్తర్వులను వెనక్కి తీసుకోవాలని యుటిఎఫ్ ప్యాపిలి మండల అధ్యక్షులు బొజ్జన్న,ప్రధాన కార్యదర్శి నరసింహారెడ్డి కోరారు. శనివారం వారు మాట్లాడుతూ ఒక తప్పుకు ఒకే శిక్ష ఉంటుంది గానీ జీవితకాలం అదే నేరా నికి పలు విధాల శిక్షలు ,అవమానాలు గురి అయ్యే విధంగా ఉత్తర్వులు ఇవ్వడం ఉపాధ్యాయ లోకాన్నే అవమానపరచడం లాగా ఉందని అన్నారు. అంతేకాకుండా ఆ ఉపాధ్యాయులకు 10వ తరగతి పరీక్ష విధులు కేటాయించలేదు దూర ప్రాంతాలలో ఫోర్త్ కేటగిరిలో వారికి విధులను కేటాయించి తిరిగి పదవ తరగతి పరీక్షలు అయిపోయేంతవరకు స్టేషన్లో ఉండాలని ఉత్తర్వులు ఇవ్వడం ఎంతవరకు సమంజసం అన్నారు. వెంటనే ఈ ఉత్తర్వులను వెనక్కి తీసుకోవాలని ఉపాధ్యాయుల ఆత్మ గౌరవాన్ని కాపాడాలని డిమాండ్ చేశారు. రఘు నాయక్,రమేష్ నాయుడు,హుసేన్ బాషా,అంజనప్ప,సుమన్,వేణు మాధవ తదితరులు పాల్గొన్నారు.

ఎండియు వాహనాల ఇన్సూరెన్స్ చెల్లించండి

ప్రజాశక్తి - చాగలమర్రి

రాష్ట్రంలో ఎండీయూ వాహనాలకు సంబంధించిన ఇన్సూరెన్స్ డబ్బులు ప్రభుత్వం కడతామని చెప్పిందని, నేటికీ చెల్లించకపోవడంతో బ్యాంక్ఆఫ్ బరోడా వారి ఇష్టానుసారంగా ఎండియు ఆపరేటర్ల ఖాతాల్లో కట్చేయడం జరిగిందని ఎండీయూ ఆపరేటర్ల సంఘం అధ్యక్షులు షరీఫ్, ఉపాధ్యక్షులు రమేష్ తెలియజేశారు. చాగలమర్రి తహసీల్దారు కార్యాలయ ంలో తహసీల్దారు విజయ్ కుమార్‌కు శనివారం వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఎండీయూ ఆపరేటర్లుగా విధులు నిర్వహిస్తుండగా గుండెపోటుతో, అనారోగ్యంతో దాదాపు 57 మంది మృతిచెందడం జరిగిందన్నారు. వారందరికి తక్షణమే ప్రభుత్వం బీమా సదుపాయం కల్పించి వారి కుటుం బాలను ఆదుకోవాలన్నారు. గత రెండు సంవత్సరాల కాలంలో పెండింగ్లో ఉన్న జీతాలను తక్షణమే విడుదల చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆపరేటర్లు గోపాల్, లక్ష్మయ్య, విష్ణు పాల్గొన్నారు.

బిజెపి విధానాలను తిప్పి కొట్టాలి

- రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రాజశేఖర్

ప్రజాశక్తి - ఆత్మకూర్

బిజెపి కార్మిక కర్షక వ్యతిరేక విధానాలను తిప్పి కొట్టాలని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రాజశేఖర్, సిఐటియు జిల్లా అధ్యక్షులు ఏసు రత్నంలు అన్నారు. శనివారం పట్టణంలోని సుదర్శన వర్మ భవనంలో ఏప్రిల్ 5వ తేదీన ఢిల్లీలో జరిగే పోరాట ప్రదర్శనలు జయప్రదం చేయాలని గోడ పత్రికలు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం కార్మికులు, రైతుల, ప్రజల సమస్యలను పట్టించుకోవడం లేదని, మతం పేరుతో ప్రజలను విడగొట్టి పరిపాలిస్తు న్నదని అన్నారు. కార్మికులను యజమానులకు బానిసలు చేసే విధంగా మోడీ ప్రభుత్వం కార్మిక చట్టాలు మార్పులు చేసి, కార్మికుల నియామకాలు తొలగింపులో యజమానిష్టారాజ్యం చేసింది అన్నారు. రైతుల ఆదాయాలు రెట్టింపు చేస్తామని అధికారంలోకి వచ్చిన మోడీ ప్రభుత్వం తన రైతు వ్యతిరేక విధానాలతో వారిని ఆత్మహత్యలకు పురిగొల్పిందన్నారు. ఈ విధానాలను వ్యతిరేకిస్తూ ఢిల్లీ ప్రదర్శనకు ప్రజలు వేలాదిగా తరలిరావాలని కోరారు.

కార్మిక సంఘాల ఆధ్వర్యంలో చలో ఢిల్లీ వాల్ పోస్టర్ విడుదల చేస్తున్న రైతు సంఘం నాయకులు, తదితరులు

ఈ కార్యక్రమంలో కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి సుధాకర్, సిఐటియు పట్టణ కార్యదర్శి రాం నాయక్, ఉపాధ్యక్షులు రణధీర్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి లు నరసింహా నాయక్, స్వాములు, రైతు సంఘం మండల అధ్యక్ష కార్యద ర్శులు మా బాష, వీరన్న, ఎస్ఎఫ్ఐ నాయకులు ప్రతాప్, తదితరులు పాల్గొన్నారు.

బండి ఆత్మకూర్ : ఏప్రిల్ 5న చేపట్టిన చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సిఐటియు జిల్లా నాయకులు రత్నమయ్య, సిపిఎం సీనియర్ నాయకులు రామచంద్రుడు, వ్యకాసం నాయకులు డేవిడ్, కౌలు రైతుల సంఘం మండల అధ్యక్షుడు నర్సింహులు పేర్కొన్నారు. ఈ మేరకు బండి ఆత్మకూరు మండల కేంద్రంలో వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో హమాలీ యూనియన్ నాయకులు జయన్న సిపిఎం నాయకులు రాజశేఖర్, డివైఎఫ్ఐ నాయకులు రాజేష్, సిఐటియు మండల నాయకులు రాజు, తదితరులు పాల్గొన్నారు.

బండి ఆత్మకూర్ : పోస్టర్లను విడుదల చేస్తున్న ప్రజా సంఘాల జిల్లా నాయకులు

పొదుపు మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలి

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను పొదుపు మహిళలు సద్వినియోగం చేసుకొని అభివృద్ధి చెందాలని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి అన్నారు. మూడవ విడత వైయస్సార్ ఆసరా కార్యక్రమాన్ని స్థానిక మున్సిపాలిటీ కార్యాలయ ఆవరణంలో నంద్యాల విజయ పాల డైరీ చైర్మన్ ఎస్.వి జగన్మోహన్ రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే 705 అర్హత గల సంఘాలకు, ఆళ్లగడ్డ టౌన్ పరిధిలో 4.93 కోట్లు చెక్కును, అలాగే మండలంలోని 454 స్వయం సహాయక సంఘాలకు 2.92 కోట్ల చెక్కును అందించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రమేష్ బాబు, ఎంపీడీవో సుబ్బారెడ్డి, తాసిల్దార్ హరినాథ్ రావు, వెలుగు ఏరియా కోఆర్డినేటర్ దానం, మెప్మా జిల్లా మిషన్ కోఆర్డినేటర్ రాములు, మున్సిపల్ వైస్ చైర్మన్ మాదం మరియమ్మ, ఆళ్లగడ్డ ఎంపీపీ గజ్జల రాఘవేంద్ర రెడ్డి, వైస్ ఎంపీపీలు నాసారి ప్రసాద్, దాదా పీర్లు, మార్కెట్ యార్డ్ మాజీ వైస్ చైర్మన్ గోపవరం నరసింహరెడ్డి, కౌన్సిలర్ గోట్లూరు సుధాకర్ రెడ్డి, మున్సిపల్ కోఆప్షన్ నెంబర్ రమేష్ గౌడ్, మెప్మా ఆర్గనైజర్లు వెంకటసుబ్బయ్య, లక్ష్మీదేవి, మహిళా సమైక్య అధ్యక్షులు బద్రి నాగేశ్వరమ్మ, పొదుపు సంఘాల మహిళలు, మున్సిపల్, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



పొదుపు మహిళలకు ఆసరా చెక్కు అందజేస్తున్న దృశ్యం

పగిడ్యాల : వైఎస్ఆర్ ఆసరా పథకం కింద పగిడ్యాల మండలానికి రూ 6 కోట్ల 82 లక్షలు మంజూరైనట్టు ఎపిఎం శ్రీనివాసులు శనివారం తెలిపారు. ఈ సందర్భంగా ఎపిఎం మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పొదుపు మహిళలకు వైఎస్ఆర్ అసరా పథకం నిధులు విడుదల చేశారు. మండలంలోని 756 పొదపు సంఘాలకు ఉన్నాయని 7564 సభ్యులు ఉన్నారన్నారు. వైఎస్ఆర్ ఆసరా పథకం కింద మూడు వడతలుగా మండలానికి రూ 20 కోట్ల 46 లక్షలు మంజురైన్నావని అన్నారు. పగిడ్యాల రైతు భరోస కేంద్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమానికి పొదుపు మహిళలతో పాటు ఎంపిడిఒ వెంకటరమణ, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ గంగిరెడ్డిగారి రమాదేవి, జెడ్పిటిసి పుల్యాల దివ్య, ఉపాధ్యాక్షురాలు పల్లే ఆరుణామ్మ, సిసిలు హాజరై తిలకించారు.

పగిడ్యాల: కార్యక్రమాన్ని టివిలో వీక్షిస్తున్న పొదుపు మహిళలు

నేషనల్ మెరిట్ స్కాలర్‌షిప్‌కు జిల్లా విద్యార్థులు

ప్రజాశక్తి - కొలిమిగుండ్ల

నేషనల్ మెరిట్ స్కాలర్ షిప్‌నకు ఎపి మోడల్ స్కూల్ విద్యార్థులు ఆరుగురు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ చంద్రసేనరెడ్డి శనివారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ 8వ తరగతి విద్యార్థులు రమ్య, మధువసంత, కళ్యాణ్ బాబు, మహమ్మద్ షరీఫ్, కిరణ్ తేజ, రవికుమార్‌లు ఎన్ఎంఎంఎస్ పోటీ పరీక్షల్లో ప్రతిభ చాటి స్కాలర్‌షిప్‌నకు ఎంపికయ్యారని చెప్పారు. ఇందుకు కృషి చేసిన ఉపాధ్యాయులకు అభినందనలు తెలియజేశారు. **శిరివెళ్ల :** మండలంలోని యర్రగుంట్ల గ్రామం జిల్లా పరిషత్ హైస్కూల్ 8వ తరగతి విద్యార్థి శ్రీగంధపు వినయ్ నేషనల్ మెరిట్ స్కాలర్‌షిప్‌కు ఎంపికయ్యాడు. ఇలాంటి జాతీయ స్థాయి మెరిట్ స్కాలర్ షిప్‌ను సాధించేందుకు ఇతర విద్యార్థిని విద్యార్థులు సైతం పోటీ పడాలని ఉపాధ్యాయులు సూచించారు. **మహానంది :** మండలంలోని తిమ్మాపురం ఆదర్శ పాఠశాల నుంచి 8వ తరగతి విద్యార్థులు 11 మంది ఎన్ఎంఎంఎస్ స్కాలర్‌షిప్‌నకు ఎంపిక కావడం గర్వకారణమని పాఠశాల ప్రిన్సిపాల్ కె. లక్ష్మణరావు తెలిపారు. నంద్యాల జిల్లాలోని అన్ని యాజమాన్య పాఠశాలల్లోకెల్లా అత్యధికంగా 11 మంది విద్యార్థులు ప్రవల్లిక, కమలాకర్, చైతన్య శ్రీ, బాల ప్రశాంత్, శ్రీలేఖ, కార్తీక్, ఉమా మహేశ్వరి, రామ్ చరణ్, దావూద్ ఇబ్రహీం, రాజేశ్వరి, వెంకట వర్షితలు ఎంపికై జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో నిలవడం హర్షించదగిన విషయమన్నారు. **పాములపాడు :** నేషనల్ మీన్స్ మెరిట్ కమ్స్ స్కాలర్‌షిప్‌కు పాములపాడు జడ్పీహెచ్ హైస్కూల్ నుండి ఎస్ రాకేష్, వేంపెంట జెడ్పిహెచ్ హైస్కూల్ నుండి కె వర్ధన్ నాయక్, లావణ్య విద్యార్థులు ఎంపికయ్యారని వేంపెంట పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జే కృష్ణమూర్తి, పాములపాడు పాఠశాల ఇన్చార్జి హెచ్ఎం గోపాల్ తెలిపారు. శనివారం వారు మాట్లాడుతూ 2022 సంవత్సరం జరిగిన పరీక్షలో వేంపేట, పాములపాడు పాఠశాలలకు చెందిన విద్యార్థులు ప్రతిభ చూపి ఈ స్కాలర్షిప్‌కి ఎంపి కావడం ఎంతో గర్వకారణం అని తెలియజేశారు. ఈ స్కాలర్షిప్ వల్ల విద్యార్థులకు నాలుగు సంవత్సరాలు 9వ తరగతి నుండి ఇంటర్మీడియట్ వరకు ప్రతి సంవత్సరం రూ.12000లు వారి అకౌంట్లో జమా అవుతాయని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను వారు అభినందించారు. **ప్యాపిలి:** ప్యాపిలి బాలుర ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న తరుణ్ కుమార్ నాయుడు ఎన్ఎంఎంఎస్ స్కాలర్ షిప్‌కు ఎంపికయ్యాడు. మధుసూధన్ రాజు, లింగేశ్వరిల కుమారుడైన తరుణ్ కుమార్ నాయుడు గత ఏడాది నవంబర్‌లో స్కాలర్‌షిప్ పరీక్ష రాశాడు. శనివారం విడుదలైన ఫలితాల్లో తరుణ్ కుమార్ 103 మార్కులు సాధించి స్కాలర్‌షిప్‌కు అర్హత సాధించాడు. తరుణ్ కుమార్‌కు ఏడాదికి రూ.12 వేలు చొప్పున నాలుగు సంవత్సరాల పాటు స్కాలర్ షిప్ వస్తుంది. ఎంపికైన విద్యార్థికి మధు సూధన శర్మ, శ్రీధర్ రాజు, ఉపాధ్యాయులు అభినందించారు.

శిరివెళ్ల : నేషనల్ మెరిట్ స్కాలర్షిప్ పరీక్షలలో ఎంపికైన శ్రీ గంధపు వినయ్‌లను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

పాములపాడు :విద్యార్థులకు అభినందిస్తున్న దృశ్యం

బాపనయ్య ఆశయాలను సాధిద్దాం

మాట్లాడుతున్న ఎం నాగేశ్వరావు

5వ పేజీ తరువాయి.. ఆత్మకూర్: గుంటూరు బాపనయ్య ఆశయాలను సాధిద్దామని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం నాగేశ్వరావు పేర్కొన్నారు. శనివారం నందికొట్కూరు మార్కెట్ యార్డ్‌లో సిపిఎం ఆధ్వర్యంలో గుంటూరు బాపనయ్య 45వ వర్ధంతి సభ సిఐటియు పట్టణ కార్యదర్శి గోపాలకృష్ణ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం నాగేశ్వరావు, సిపిఎం నాయకులు పి వెంకటేశ్వర్లు, పి ఫకీర్ సాహెబ్, ఎం.కరణ మాట్లాడారు. అంటరానితనానికి వ్యతిరేకంగా, దున్నేవారికి భూమి పంచాలని 1946లో చల్లపల్లి జమిందారి భూములకు వ్యతిరేకంగా పోరాడి 17 వేల ఎకరాలు పేదలకు పంపిణీ చేయడం జరిగిందని వారు తెలిపారు. 1952 నుండి మూడుసార్లు శాసనసభకు ఒకసారి ఎమ్మెల్సీగా గెలవడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు హమాలి నాయకులు సీతా రాముడు, స్వాములు, మద్దిలేటి, పాండు, వెంకటేశ్వర్లు, రైతు, వ్యకాసం నాయకులు ఏసన్న, నరసింహులు, నాగన్న, మా బాష, చాంద్ బాషా తదితరులు పాల్గొన్నారు.

- గుంటూరు బాపనయ్య ప్రజలు తనకు కట్టబెట్టిన పదవిని వారి సంక్షేమానికి, ప్రజా సేవకు మాత్రమే ఉపయోగించి స్ఫూర్తిగా నిలిచారని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఎన్ స్వాములు అన్నారు. శనివారం గుంటూరు బాపనయ్య 45 వ వర్ధంతి సందర్భంగా వడ్ల రామాపురం గ్రామంలో వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి నరసింహ నాయక్ అధ్యక్షతన ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు చంద్ర, జ్యోతి, దివనమ్మ, రమాదేవి, శివన్న, రాముడు, మరియమ్మ, లక్ష్మీదేవి, పుల్లమ్మ, లింగమ్మ, ఆది, రాముడు, రమణ, తదితరులు పాల్గొన్నారు.

బాపనయ్యచిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

వేలంపాటలో పెరిగిన ఆదాయం

ప్రజాశక్తి - పగిడ్యాల

సంత మార్కెట్, బండి మెట్ట, వ్యాపార దుకాణల వేలంపాటలో పగిడ్యాల గ్రామ పంచాయతీకి ఆదాయం పెరిగిందని ఇఒఆర్‌డి పుల్లయ్య తెలిపారు. శనివారం స్థానికల గ్రామ పంచాయతీలో బండి మెట్ట, సంత మార్కెటు, వ్యాపార దుకాణాల వేలంపాట నిర్వహించారు. ఈ సందర్భంగా ఇఒఆర్‌డి మాట్లాడారు. బండి మెట్ట, సంతమార్కెట్ వేలంపాటను రూ 1740 00కు టీ తిమ్మయ్య వేలంపాట కైవసం చేసుకు న్నారు. వ్యాపార దుకాణలు గతంలో ఉన్న వారే రూ 60 వేలకు కైవసం చేసుకున్నారు. ప్రభుత్వం ప్రారంభం వేలపాట రూ 125166 నిర్ణయించగా రూ 174000 లతో తిమ్మయ్య వేలంపాట కైవసం చేసుకు న్నారు. రెండు వ్యాపార దుకాణలు ప్రభుత్వం వేలంపాటను రూ50 వేలకు నిర్ణయించింది. బండి మెట్టకు ,సంత మార్కెట్‌కు రూ 48,843 , రెండు దుకాణల వేలంపాటలో రూ 10 వేలు గ్రామ పంచాయతీకి ఆదామం వచ్చిందని ఆయన తెలిపారు. కార్యదర్శి ఉపేంద్రరెడ్డి, సర్పంచు పెరుమాళ్ళ శేషన్న పాల్గొన్నారు. **ప్యాపిలి :** ప్యాపిలి గ్రామపంచాయతీ పరిధిలోని వారపు సంత, కూరగాయల మార్కెట్, బస్టాండు, మాంసపు మార్కెట్‌లకు సర్పంచ్ లక్ష్మీదేవి, జడ్పిటిసి బోరెడ్డి శ్రీరామిరెడ్డి, ఉప సర్పంచ్ గడ్డం భువనేశ్వర్ రెడ్డి, ఈఓఆర్డి బాలకృష్ణ, ఈఓ శివకుమార్ గౌడ్‌ల ఆధ్వర్యంలో శనివారం వేలంపాటలు నిర్వహించారు. ఈఓఆర్డి మాట్లాడుతూ గత ఏడాది రూ.881,000కి వేలంపాటను కైవసం చేసుకోగా, ఈ సంవత్సరం రూ.9 లక్షల 80 వేలకు పట్టణానికి చెందిన జింకల ఆంజనేయులు వేలంపాటను కైవసం చేసుకున్నారన్నారు. గత ఏడాది కంటే ఈ ఏడాది 99 వేల రూపాయలు గ్రామ పంచాయతీకి ఆదాయం వచ్చిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బోరెడ్డి రాము, పాటదారులు, తదితరులు పాల్గొన్నారు.

చాగలమర్రి : చాగలమర్రి పట్టణంలోని మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలోని వేలంపాటలను శనివారం ఈవో సుదర్శన్ రావు ఆధ్వర్యంలో నిర్వహిం చారు. ఈ వేలంపాటలో గ్రామ పంచాయతీ దినసరి బస్టాండు వేలంపాట గతేడాది రూ.6.65 లక్షలు ఉండగా ఈ ఏడాది రూ.41వేలు అధికంగా రూ.7.15 లక్షలకు వేలం పాట జరిగింది. బండ్లమెట్ట, వారపు సంత గతేడాది రూ.1.95 లక్షలకు వేలం పాట జరగగా, ఈఏడాది రూ.2.01 లక్షలకు వేలం జరిగింది. కబేళా గతేడాది రూ.73వేలకు వేలంపాట జరగగా ఈ ఏడాది రూ.99వేలకు వేలం పాట జరిగింది. సంత మార్కెట్ వేలం వాయిదా పడింది. మొత్తం వేలం పాటల్లో రూ. 78వేలు అధికంగా ఆదా యం వచ్చిందని ఈవో సుదర్శన్ రావు వివరించారు.

రుద్రవరం : రుద్రవరంలోని మేజర్ పంచాయతీ మార్కెట్ నిర్వహణకు వేలం పాటలు సర్పంచ్ బైరి విజయలక్ష్మి ఆధ్వర్యంలో ఈవోపి ఆర్ డి భాగ్యలక్ష్మి కార్యదర్శి మహమ్మద్ రఫీ శనివారం నిర్వహించారు. వారపు సొంత మార్కెట్‌కు పి ఖాసీం వలి రూ.8 లక్షల 1 వేలకు పాడి వేలం దక్కించుకున్నారు. దినసరి మార్కెట్ ఎం.దానమ్మ రూ.3 లక్షల 11 వేలకు దక్కించుకున్నారు. కమేళా మార్కెట్ చౌడయ్య రూ.8100లకు వేలపాట దక్కించుకున్నారు. కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది వేలంపాటదారులు పాల్గొన్నారు. **శిరివెళ్ల :** మండలంలోని యర్రగుంట్ల, శిరివెళ్ల మేజర్ పంచాయతీ గ్రామాలలో జరిగిన వేలంపాటల్లో అధిక ఆదాయం వచ్చినట్లు ఈవోపిఆర్‌డి సాల్మన్ రాజ్ పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ శిరివెళ్ల డైలీ మార్కెట్‌కు రూ.7,96,000, సంత మార్కెట్‌కు రూ.8,99,000, కమేళాకు రూ.50,000 అధిక వేలం పాడారన్నారు. యర్రగుంట్ల సంత మార్కెట్‌కు రూ.10,00,000, డైలీ మార్కెట్ రూ.1,46,000, కమేళా మార్కెట్‌కు రూ. 1,18,000 వేలంతో పాటదారులు కైవసం చేసుకున్నారని చెప్పారు. డిఎల్‌పిఒ రాంబాబు, ఈఓ వెంకటేశ్వర్లు, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

వాసాపురం వెంకటేశ్వర స్వామిని దర్శించుకున్న హైకోర్టు లాయర్

ప్రజాశక్తి - రుద్రవరం

రుద్రవరం మండలంలో వెలసిన వెంకటేశ్వర స్వామి దేవాలయాన్ని శనివారం హైకోర్టు లాయర్ గోగిశెట్టి నరసింహారావు, హైదరాబాద్ సుమన్‌లు సందర్శించి స్వామి వారికి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా రుద్రవరంకు చెందిన పోలా గురుమూర్తి, దేవాలయ కమిటీ చైర్మన్ మధు సూదన రెడ్డి, ఉపాధ్యక్షులు లింగం వెంకట రంగనాయకులు శెట్టి, అన్నదాత ఓబులయ్యలు వారికి ఆలయ మర్యా దలతో ఆహ్వానించి ఘనంగా సన్మానించారు. వెంకటే శ్వర స్వామి చిత్రపటాలను అందజేశారు. ఈ సంద ర్భంగా హైకోర్టు లాయర్ గోగిశెట్టి నరసింహారావు మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తామన్నారు. బలిజలు, కాపుల సంక్షే మానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో గంతి శీను తదితరులు పాల్గొన్నారు.

లాయర్‌ను ఘనంగా సన్మానించి, స్వామి చిత్రపటాలను అందజేస్తున్న ఆలయ నిర్వహకులు

పాలాభిషేకం చేస్తున్న వాల్మీకులు

సిఎం చిత్రపటానికి వాల్మీకులు పాలాభిషేకం

ప్రజాశక్తి - బేతంచెర్ల

రాష్ట్రంలో బోయ వాల్మీకి కులస్తులు ఎస్టీ జాబితాలో చేర్చాలని పోరాటాల నేపథ్యంలో అసెంబ్లీ సమావేశాల చివరి రోజు తీర్మానాన్ని అసెంబ్లీ ఆమోదించడాన్ని హర్షిస్తూ శనివారం స్థానిక వైసీపీ కార్యాలయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి చిత్రపటానికి మండలంలోని వాల్మీకులు బోయలుపాలాభిషేకం చేశారు. రాష్ట్ర వాల్మీకి ఫెడరేషన్ డైరెక్టర్ మురళీకృష్ణ, ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, చైర్మన్ రెడ్డి ఆధ్వర్యంలో మండలంలోని వాల్మీకులు అధిక సంఖ్యలో చేరుకొని ముఖ్యమంత్రి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. మురళీకృష్ణ, ఎంపీపీ నగర పంచాయతీ చైర్మన్లు మాట్లాడారు. రాష్ట్రంలో బడుగు బలహీన వర్గాలకు అన్ని రకాల ప్రాధాన్యతను కల్పించడం వైఎస్ఆర్సిపి ప్రభుత్వానికి సాధ్యమైందని వారన్నారు. ఎంతోమంది వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేస్తామని మాటల చెప్పడం తప్ప చేసింది లేదన్నారు. ముఖ్యమంత్రిజగన్మోహన్ రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రం దృష్టికి తీసుకుపోవడం జరుగుతుందన్నారు. ఎవ్వరైతే బడుగు బలహీన వర్గాల కోసం పనిచేస్తున్నారో వారిని గుర్తించాలన్నారు. వాల్మీకి సంఘం నాయకులు వెంకటరాముడు, కృష్ణమూర్తి, రామస్వామి, మనోహర్, రామకృష్ణ, రంగస్వామి, నారాయణ, మనోహర్, వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎస్‌సి విద్యార్థులకు ఆర్‌టిసి ఉచిత ప్రయాణం

ప్రజాశక్తి-డోన్

ఏప్రిల్ 3 నుంచి 18వరకు పరీక్షలకు హాజరయ్యే ఎస్ఎస్‌సి విద్యార్థులకు ఆర్‌టిసిలో ఉచితంగా ప్రయాణ సౌకర్యం కల్పించినట్లు డోన్ డిపోమేనేజర్ ఎం.శశిభూషన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నివాసస్థానం నుండి పరీక్షాకేంద్రం వరకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించిందని పేర్కొన్నారను. పదోతరగతి విద్యార్థినీ, విద్యార్థులు, తమ వద్ద బస్సు పాసు లేనప్పటికీ, తమ ఒరిజినల్ హాల్ టిక్కెట్లు "సర్వీసు కండక్టరు చూపి, అన్ని పల్లెవెలుగు (ఆర్డినరీ) బస్సులలో తమ నివాస స్థానం నుండి పరీక్షాకేంద్రం వరకు , పరీక్షా కేంద్రం నుండి తిరిగి తమ నివాస స్థానానికి ఉచితంగా ప్రయాణించవచ్చని వివరించారు. ఏప్రెల్ 3 నుంచి 18వరకు కేవలం పరీక్ష దినములలో, పరీక్షా సమయానికి రెండు గంటల ముందు పరీక్ష ముగిసిన తర్వాత రెండు గంటల వరకు మాత్రమే ఈ ఉచిత ప్రయాణ సౌకర్యం ఉంటుందని తెలిపారు.

సంత జూటూరులో ఎద్దుల బల ప్రదర్శన

ప్రజాశక్తి - బండి ఆత్మకూరు

మండల పరిధిలోని సంత జూటూరు గ్రామంలో శ్రీరామనవమి పండుగ పురస్కరించుకుని ఏప్రిల్ 5వ తేదీన రాష్ట్రస్థాయి ఎద్దుల బల ప్రదర్శన పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు భూమ రఘునాథరెడ్డి, కొంగిస శివశంకర్‌లు శనివారం తెలిపారు. గ్రామ ప్రజలు,శ్రీశైలం నియోజకవర్గం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి సహకారంతో ఈ పోటీలను నిర్వహించడం జరుగుతుందన్నారు. న్యూ క్యాటగిరి విభాగంలో ఎద్దుల బల ప్రదర్శన నిర్వహించడం జరుగుతుందని ఆసక్తిగల ఎద్దుల యజమానులు రూ 600 డిపాజిట్ చెల్లించి పోటీల్లో పాల్గొనవచ్చునన్నారు. విజేతగా నిలిచిన వృషబ రాజములకు మొదటి బహుమతి రూ 50 వేలు, రెండవ బహుమతి రూ 40 వేలు, మూడో బహుమతి రూ 30 వేలు, నాలుగో బహుమతి రూ 20 వేలు,ఐదవ బహుమతి రూ15 వేలు,ఆరవ బహుమతి రూ12 వేలు,ఏడవ బహుమతి రూ 10 వేలు,ఏనిమిదో బహుమతి రూ 8వేల ప్రకారం అందజేయడం జరుగుతుందని నిర్వహకులు తెలిపారు.

త్వరలో ఆర్ఎస్ రంగాపురంలో భూ రీ సర్వే

ప్రజాశక్తి - బేతంచెర్ల

మండలంలోని ఆర్ఎస్ రంగాపురం గ్రామంలో రీసర్వే కార్యక్రమం త్వరలో జరగబోతుందని తహాశీల్దార్ నరేంద్రనాథ్ రెడ్డి శనివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రతిష్టాత్మకంగా జరుగుతున్న జగనన్న భూహక్కు భూ రక్షలో భాగంగా ఆర్ఎస్ రంగాపురం గ్రామంలో రీసర్వే కార్యక్రమం త్వరలో జరుగుతుందని ఆయన తెలిపారు. కాబట్టి ఈ రీసర్వే కార్యక్రమంనకు ముఖ్యంగా రైతులు, గ్రామ ప్రజలు సహకరించాలని ఆయన తెలిపారు. ఈ రీ సర్వేకు సంబంధించి డ్రోన్ ఫ్లై పూర్తయి ఓఆర్ఐ తహాశీల్దార్ కార్యాలయానికి చేరాయని ఆయన అన్నారు. ఈ రీ సర్వేలో భాగంగా మండలంలోని విలేజ్ సర్వేయర్లకు తహాశీల్దార్ నరేంద్ర నాథరెడ్డి వారికి అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తాసిల్దార్ సత్యదీప్, రీ సర్వే డిప్యూటీ తహాశీల్దార్ సాయి దేవనాథ్, మండల సర్వేయర్ జోష్ణ, విలేజ్ సర్వేయర్లు సాయి రాఘవ, మంజునాథ్, కేశవ్, విలేజ్ సర్వేర్లు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఇష్టపడి చదవాలి

- గిరిజన ఉద్యోగుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు జవహర్ నాయక్

ప్రజాశక్తి - ఆత్మకూర్

పదవ తరగతి విద్యార్థులు కృషి, పట్టుదల,క్రమశిక్షణతో ఇష్టపడి చదవి మంచి మార్కులు సాధించాలని గిరిజన ఉద్యోగుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు జవహర్ నాయక్ అన్నారు. శనివారం ఆత్మకూరు పట్టణంలోని సమీకృత గిరిజన హాస్టల్ విద్యార్థులకు పరీక్ష సామాగ్రిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదివి భయపడకుండా పరీక్షలకు హాజరుకావాలన్నారు. తల్లిదండ్రులు విద్యార్థులకు ఆస్తిపాస్తులు ఇవ్వకపోయినా, మంచి ఉన్నత చదువును ఇస్తే చాలు అనే విధంగా సమాజం ఉందన్నారు. తమ పిల్లల చదువు తల్లిదండ్రులకు భారం కాకుండా ఉండాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం తల్లిదండ్రులకు డబ్బులు ఇచ్చి పిల్లలను చదివించడం జరుగుతుందన్నారు. విద్యార్థులు పదోతరగతి కష్టపడి చదివి మంచి మార్కులు సాధించి, గ్రామానికి, తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు,మంచి పేరు తీసుకురా వాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ భాస్కర్, హనుమంతునాయక్, వెంకటేశ్వర్లు,రవి,శ్రీను పాల్గొన్నారు.

మహారాజ శ్రీ కర్నూలు ఏడవ అదనపు జిల్లా

M.V.O.P No. 2/2022

ముద్దారం ఈశ్వరయ్య ... అర్జీదారు

V/s.

కొత్తపల్లి సురేంద్ర వగైరా ... రెస్పాండెంట్లు

1,3వ రెస్పాండెంటుకు నోటీసులు

1. కొత్తపల్లి సురేంద్ర తండ్రి కె.సుబ్బయ్య, కారు ఓనరు,బేరింగ్ నెం.ఎ.పి.10-యన్-7821, ఇంటి.నెం.3-93, భాగ్యనగరం గ్రామం, దొర్నిపాడు(మం) ఆళ్ళగడ్డ, కర్నూలు జిల్లా ప్రస్తుతం నంద్యాల జిల్లా.
3. గాలి క్రిష్ణయ్య తండ్రి జి. లక్ష్మయ్యనాయుడు, కారు డ్రైవరు బేరింగ్ నెం.ఎ.పి.10-యన్-7821, ఇంటి.నెం.3-5, భాగ్యనగరం గ్రామం, దొర్నిపాడు(మం) ఆళ్ళగడ్డ, కర్నూలు జిల్లా ప్రస్తుతం నంద్యాల జిల్లా.

పై నంబరు M.V.O.P లో అర్జీదారు తనకు రోడ్డు ప్రమాదములో జరిగిన గాయములకు నష్టపరిహారం రూ.4,00,000/- లు, ఇందుపైన ప్రమాదం జరిగిన రోజు నుండి 18% ప్రకారం వడ్డీ మరియు కోర్టు ఖర్చులు ఇప్పించమని కోరుతూ అర్జీదాఖలు చేసినాడు. ఇందులో 1వ మరియు 3వ రెస్పాండెంట్లు అయిన నీకు ఏమైన అక్షేపణలు వున్న యెడల 13-4-2023 వ తేది ఉదయం 10.30 గం.లకు పై కోర్టులో మీరుకాని మీ తరుపు న్యాయవాదికాని హాజరై మీకు గల అభ్యంతరములు తెలుపుకోవలెను. లేనియెడల మీ పరోక్షమున విచారించి తీర్మానింపబడునని ఇందుమూలముగా తెలియజేడమైనది.

కోర్టు వారి ఉత్తర్వుల మేరకు

తేది : 13-4-2023

యం.నాగేశ్వరరెడ్డి
వై.రాఘవేంద్రరెడ్డి,
అర్జీదారు పరం న్యాయవాదులు
కర్నూలు.